Email : telanganaveenaoffcial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

epaper.telanganaveena.com 09 బుధవారం, జనవరి 2025 సంపుటి :2 సంచిక: 106 హైదరాబాద్ పేజీలు: 8 రూ.3/-




## స్పేస్ నిర్మాణానికి ప్రధాని గ్రీన్ సిగ్నల్ :

### ఇస్రో కొత్త చీఫ్

**తిరువనంతపురం, జనవరి 8 (తెలంగాణ వీణ):**

ప్రముఖ రాకెట్ శాస్త్రవేత్త వీ నారాయణన్‌ను ఇస్రో చీఫ్‌గా నియమించిన విషయం తెలిసిందే. ఇస్రో చాలా విజయవంతమైన దశలో ఉన్నదని, చంద్రయాన్-4తో పాటు గగన్‌యాన్ మిషన్లు తమ ముందు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇస్రో చైర్మెన్‌తో పాటు అంతరిక్ష శాఖ కార్యదర్శిగా నియమితుడైన సందర్భంగా వీ నారాయణన్ సంతోషం వ్యక్తం చేశారు.



### మహాకుంభమేళాకు దేశవిదేశాల నుంచి

## 40 కోట్ల మంది

### రైల్వేశాఖ పెద్ద ఎత్తున ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు

**న్యూఢిల్లీ,జనవరి8(తెలంగాణ వీణ):**

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో ఈ నెల 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరుగనున్న జరుగనున్న మహా కుంభమేళాకు దేశవిదేశాల నుంచి 40 కోట్ల మంది వరకు వస్తారని అంచనా వేస్తున్నారు. యాత్రికులు, భక్తులను చేరవేసేందుకు రైల్వే శాఖ పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. 50 రోజులపాటు 13 వేల రైళ్లు నడపాలని నిర్ణయించింది. వీటిలో పది వేలు రెగ్యులర్ సర్వీసులు కాగా.. మూడు వేలు ప్రత్యేక రైళ్లు. మేళా జరగడానికి 2-3 రోజుల ముందు..



### రోడ్డు ప్రమాద బాధితులకు

## నగదు రహిత చికిత్సలు

### కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కీలక ప్రకటన

**న్యూఢిల్లీ,జనవరి 8 (తెలంగాణ వీణ):**

కేంద్ర రోడ్డు రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కీలక పథకాన్ని ప్రకటించారు. రోడ్డు ప్రమాదానికి గురైన బాధితులకు నగదు రహిత చికిత్సను అందించేందుకు ప్రత్యేక పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఎవరైనా రోడ్డు ప్రమాదంలో గాయపడితే చికిత్సకు అయ్యే ఖర్చులో గరిష్ఠంగా రూ.1.50 లక్షలు ఈ పథకం ద్వారా ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. అయితే ఇది మొదటి ఏడు రోజుల చికిత్సకు అయ్యే బిల్లుకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొన్నారు.





### ఢిల్లీలోని సీఎం బంగ్లా వద్ద

## హైడ్రామా

### ఆప్ నేతలను అడ్డుకున్న పోలీసులు

**న్యూఢిల్లీ, జనవరి 8 (తెలంగాణ వీణ):**

దేశ రాజధాని ఢిల్లీలోని సీఎం బంగ్లా వద్ద హైడ్రామా నెలకొన్నది. అరవింద్ కేజ్రీవాల్ సీఎంగా ఉన్నప్పుడు షీష్ మహల్ ఆధునీకరణంలో భాగంగా టాయిలెట్‌లో గోల్డెన్ కమోడ్, స్విమ్మింగ్ పూల్, మినీ బార్ వంటివి ఏర్పాటు చేసుకున్నారని బీజేపీ ఆరోపించింది. ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆప్ దీనిని ఖండించింది.

వివరాలు 2లో

### ఫార్ములా కేసులో

## పైసా అవినీతి లేదు

● కేసులు అసలు సమస్యే కాదు ● న్యాయం కోసం సుప్రీంలో నేను కొట్లాడుతా ● రైతు, ప్రజా సమస్యలపై పార్టీ శ్రేణులు కొట్లాడాలి ● బిఆర్ఎస్ డైరీ ఆవిష్కరణలో కెటిఆర్ పిలుపు

**హైదరాబాద్,జనవరి8(తెలంగాణ వీణ):**

కేసులు అసలు సమస్యే కాదు. రైతు భరోసా విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజలకు వివరంగా చెప్పాలి. ఈ కేసుపై నేను పోరాడతాను. భారాస నేతలు కేసు గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నేను తప్పు చేయలేదు.. ఎవరికీ భయపడను‘ అని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో భారాస డైరీని ఆ కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, నేతలు హాజరయ్యారు. అనంతరం పార్టీ నేతలను ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడారు. ఫార్ములా ఈరేసు కేసు గురించి నేను చూసుకుంటాను. ఏసీబీ కేసు పెద్ద విషయం కాదు. నా కేసుల గురించి ఆందోళన, ఇబ్బంది లేదు‘ అని అన్నారు. సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తానని తెలిపారు. ఈ రేసులో ఒక్క పైసా కూడా అవినీతి జరగలేదని వెల్లడించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు రైతు, ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. 2025లో బీఆర్ఎస్‌కు కొత్త కమిటీలు పూర్తి చేస్తామన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి కమిటీలు నియమిస్తామన్నారు. ఈఏడాది పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకుంటామని తెలిపారు. జిల్లాల్లోనే పార్టీ క్యాడర్‌కు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్‌ను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతన్నకు జరుగుతోన్న మోసాన్ని ప్రజలకు వివరించాలని.. మెత్తంగా 30 శాతం రుణమాఫీ మాత్రమే జరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ‘2001లో కేసీఆర్ పార్టీ పెట్టిన నాడు ఉన్న ఇబ్బందులతో పోల్చితే ఇప్పుడు ఉన్నవి పెద్దవి కాదు. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ బిడ్డగా, ఆయన తయారు చేసిన సైనికుడిగా నేను ఎంతో ధైర్యంగా ఉంటా.

వివరాలు 2లో






## అమెరికాలో మరోమారు కార్చిచ్చు

### లాస్ ఏంజిల్స్‌లో వేల ఎకరాలు దగ్ధం

### సురక్షిత ప్రాంతాలకు 30వేలమంది తరలింపు

**న్యూయార్క్,జనవరి8(తెలంగాణ వీణ):**



అమెరికాలో కుబేరులకు ఆవాసాలైన మూడు నగరాల్లో లాస్ ఏంజెలెస్ ఒకటి. ఇప్పుడు ఆ సిటీలోని అత్యంత ఖరీదైన ప్రదేశాన్ని కార్చిచ్చు చుట్టుముట్టింది. దీంతో వేలాది ఎకరాల్లోని విలాసవంతమైన ఇళ్లు అగ్నికి ఆహుతి అవుతున్నాయి.

వివరాలు 2లో

## హ్యాట్రిక్ విజయం కోసం ఆప్ కృషి

### ఆప్‌కు మద్దతు పలికిన మమతా బెనర్జీ

### ఎక్స్ వేదికగా కృతజ్ఞతలు తెలిపిన కేజ్రీవాల్



**న్యూఢిల్లీ,జనవరి8(తెలంగాణ వీణ):**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం కోసం తీవ్రంగా శ్రమిస్తోన్న ఆమ్ ఆద్మీ పార్టీకి తృణమూల్ కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. ఫిబ్రవరి 5న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మద్దతు ప్రకటించినట్లు ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'థాంక్యూ దీదీ' అంటూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. 'ఢిల్లీ ఎన్నికల్లో ఆప్‌నకు తృణమూల్ కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. మమత దీదీకి వ్యక్తిగతంగా కృతజ్ఞతలు తెలుపుతున్నా. థాంక్యూ దీదీ.

వివరాలు 2లో

### రూ.2,600 కోట్లతో గ్రామీణ రహదారుల

## నిర్మాణం

### ప్రతి ఊరు నుంచి మండలం వరకు ఏర్పాటు

### సిఎం ఆదేశాలతో అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష

**హైదరాబాద్,జనవరి8(తెలంగాణ వీణ):**

రాష్ట్రంలో రూ.2,600 కోట్లతో గ్రామీణ రహదారుల నిర్మాణం చేపడుతున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ అనసూయ సీతక్క తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి ఆవాసం నుంచి గ్రామపంచాయతీ, అక్కడ నుంచి మండలానికి, జిల్లా కేంద్రానికి రహదారులు నిర్మిస్తున్నామని చెప్పారు. సరైన రహదారి సౌకర్యాలు లేక పోవడమే పల్లెల వెనకబాటుకి కారణమని ప్రభుత్వం పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణాన్ని చేపడుతోందని అన్నారు.

వివరాలు 2లో



Email : telanganaveenaofficial@gmail.com
Title Code : 12280
# తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..

## సంపాదకీయం

### రేషన్ బియ్యం అక్రమాలపై
# చర్యలేవీ !

పేదల ఆకలి తీర్చాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన రూపాయికే కిలోబియ్యం పథకం పందికొక్కుల పాలవుతోంది. ఇదంతా పెద్ద మాఫియాగా మారింది. బియ్యం మొత్తం విదేవాలకు తరలుతున్నాయి. కొందరు అధికారులు, రాజకీయ నేతలు కలసి దీనిని బడా వ్యాపారంగా మార్చేశారు. రూపాయికే కిలో బియ్యం పథకంలో లోపాలు కళ్లకు కనిపిస్తున్నా తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కావాలనే అచేతనంగా ఉండిపోయాయి. పథకం దుర్వినియోగం అవుతున్నా పట్టించుకోవడం లేదు. 42 ఏళ్ల క్రితం కిలో రెండు రూపాయలుగా ఉన్న బియ్యాన్ని తలకుమాసిన నేతలు అధికారంలోకి వచ్చి..కిలో రూపాయి చేశారు. ఇప్పటికే జనాభాలో 80శాతం మందికి ఈ బియ్యం ఇస్తున్నట్లు చెబుతున్నారు. అయినా ఇంకా కొత్తగా రేషన్ కార్డుల డిమాండ్ పుట్టుకొస్తోంది. పాతవాటిలో అక్రమాలను అరికట్టి, బియ్యం ధరలు పెంచి పక్కాగా పథకాన్ని అమలు చేయాల్సిన ఇరు రాష్ట్రాల సిఎంలు ఇంకా ప్రజలను మభ్య పెడుతున్నారు. వేలకోట్లు దుర్వినియోగం అవుతున్న ప్రజాధనానికి ఎవరు బాధ్యులు అన్నది చెప్పడం లేదు. ప్రజలు చెమటోడ్చి కడుతున్న పన్నుల డబ్బులను ఇష్టారీతిన వృధా చేయడమేనా పాలకుల పని అని ప్రజలు నిలదీయాల్సి ఉంది. ఇకపోతే ఎపిలో పేదల బియ్యం పూర్తిగా పక్కదారి పట్టాయి. రాష్ట్రంలో పేదలకు అందాల్సిన సబ్సిడీ బియ్యం టన్నుల కొద్దీ అక్రమంగా విదేశాలకు తరలించిన తీరు బయటపడ్డా కఠిన చర్యలు తీసుకోవడం లేదు. ఇందుకు ప్రతిపక్ష వైసిపి కారణమని టిడిపి కూటమి ఆరోపిస్తుంటే, మీరే కారణమని వైసిపి నేతలు టిడిపి, జనసేన నేతలను విమర్శిస్తున్నారు. ఈ పరస్పర విమర్శలతో కాలక్షేపం చేస్తున్నారు. లక్షల టన్నుల బియ్యాన్ని కొన్నేళ్ళుగా యథేచ్ఛగా తరలిస్తూ వచ్చారు. అసలు దోషులు బయట పడకుండా పేదల బియ్యాన్ని పెద్దలు గద్దల్లా ఎగరేసుకు పోయారు. తెలంగాణలో సైతం ఇలాంటి దోపిడీ జరుగుతున్నా చర్యలు తీసుకోవడం లేదు. ఓట్లమీద ఉన్న శ్రద్ధ అక్రమాలను అరికట్టడంలో కనిపించడం లేదు. ప్రజా పంపిణీ ద్వారా పేదలకు అందుతున్న బియ్యం అసలు పేదలకు అందడం లేదన్నది అక్షర సత్యం. ఈ బియ్యం ఆటో, లారీల స్థాయి దాటి ఓడల వరకు చేరిందని రుజువయ్యింది. బియ్యం పథకం పంపిణీ కార్యక్రమం కేంద్రానిదని, ప్రతి స్టోర్ దగ్గర మోడీ ఫోటో పెట్టాలని తెలంగాణ, ఆంధ్రలో పెద్ద యాగీ చేసిన కేంద్ర మంత్రులు, బిజెపి పెద్దలు అక్రమ బియ్యం తరలింపు విషయంలో ఎందుకు మౌనంగా ఉంటున్నారు. ఎందుకు దీనిపై చర్యలకు ఉపక్రమించడం లేదు. అన్ని రకాల సబ్సిడీ పథకాలను రద్దు చేసి సమీక్షించాలి. నిజమైన పేదలను గుర్తించాలి. దుబారా పథకాలకు కాలం చెల్లిందన్న విధంగా కళ్లెం వేయాలి. నగదు బదిలీ పథకాల అమలుపై సమీక్షించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఓట్లు ముడిపడి వున్నందున దీనిని సమీక్షించడం సాధ్యం కావడంలేదు. పేదలు రేషన్ బియ్యం ఎందుకు అమ్ముకుంటారన్న చర్చ చేయాలి. బహిరంగ మార్కెట్‌లో కనీసం 40లుగా ఉన్న బియ్యం ఇప్పుడు రూపాయికే దక్కితే అవి పెద్ద వ్యాపార వస్తువుగా మారింది. ఓడలకు ఎక్కించగలిగినంత బియ్యం అమ్మగలగడం ఇందుకు నిరద్శనం. ఎపిలో గత ఐదేళ్ళలో 1.31 కోట్ల టన్నుల రేషన్ బియ్యం దేశం దాటి విదేశాలకు వెళ్లిందని టిడిపి కూటమి ప్రభుత్వం విమర్శిస్తున్నది. కాకినాడ ఓడరేవులో సిద్ధంగా వున్న ఓడను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తనిఖీ చేసి సీజ్ చేయమని ఆదేశించారు. విశాఖపట్నం ఓడరేవులో రాష్ట్ర సివిల్ సప్లరు శాఖ మంత్రి ఇలాగే ఓ ఓడను తనిఖీ చేసి అందులో వున్న బియ్యం పేదల బియ్యమేనని ప్రకటించారు. ఇక తెలంగాణలో ఎంత దోచకున్నారో కిక్కురుమనడం లేదు. ఒకవైపు తిండి లేక పేదలు అల్లాడుతుంటే ఇంత పెద్ద ఎత్తున అక్రమంగా తరలిస్తున్న బియ్యం దొంగలను పట్టుకుని కఠినంగా శిక్షించాల్సిందే. అధికార పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం అనర్హులకు రేషన్ కార్డులు ఇవ్వడంవల్ల, అందులో ఎక్కువ మంది బియ్యం అమ్ముకునే వారు వుండే అవకాశం ఉంది. కానీ అత్యధిక పేదలు రేషన్ బియ్యంతోనే నెలలో కొద్ది రోజులైనా కడుపు నింపుకుంటున్నారు. ఇలా అక్రమాలను పక్కన పెట్టి సన్న బియ్యం ఇస్తామని ఒకరు, నాణ్యమైన బియ్యం ఇస్తామని మరొకరు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత...బియ్యాన్ని వ్యాపారంగా మార్చేస్తున్నారు. రేషన్ కార్డులకు ఇస్తున్న బియ్యానికి కిలో రూ.43.50 ఖర్చు అవుతుందని ప్రభుత్వం చెబుతున్నది. ఇంత ఖర్చు చేసినా పేదలకు మంచి బియ్యం ఎందుకు ఇవ్వలేకపోతున్నారన్నది కూడా ప్రశ్నే. ధాన్యం సేకరణ నుండే పాలకులు,ఉన్నతాధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. రీసైక్లింగ్‌కు పాల్పడుతున్నారు. నివాస ప్రాంతాల్లో స్టోర్ల ద్వారా పంపిణీ కావాల్సిన బియ్యాన్ని నేరుగా ఇతర రాష్ట్రాలకు తరలించి నాయకులు అప్పనంగా సంపాదించుకుంటున్నారు. గ్రామాల వారీగా కార్డులు ఉన్నవారి వివరాలు సేకరించి, అందులో పేదలు ఎంతమందన్నది గుర్తించాలి. నిజమైన పేదలకే బియ్యం అందాలి. బియ్యం ధరలను కూడా సవరించాలి. అప్పుడే ఈ పథకంలో అక్రమాలను నిరోధించగలం.ప్రజా పంపిణీలో అక్రమాలను అరికట్టాలి. దోషులు ఎంతటి వారైనాసరే కఠినంగా శిక్షించాలి. అదే సమయంలో నాణ్యమైన బియ్యంతో పాటు ఇతర నిత్యావసర సరుకులను రేషన్ షాపుల ద్వారా అసలు సిసలు పేదలకు అందించాలి.సార్వత్రిక ప్రజా పంపిణీ అమలు కొరకు ఉద్యమించాలి. అయితే పేదలు ఎవరన్నది కూడా నిర్వచించాలి. ఇన్నేళ్లుగా వారు పేదలుగానే ఎందుకు మగ్గుతున్నారో అధ్యయనం చేయాలి. ఇన్నేళ్లుగా పథకాలు వారికి అందుతున్నా ఎందుకు పేదరికం నుంచి బయటపడడం లేదో కూడా అధ్యయనం చేయాలి. ప్రభుత్వాలు కేవలం ప్రేక్షకపాత్రను వదిలి పనిచేయాలి.

### హ్యాట్రిక్ విజయం కోసం
# ఆప్ కృషి

మొదటిపేజీ తరువాయి

మా మంచి చెడుల్లో మీరు ఎల్లప్పుడూ అండగా నిలిచారు‘ అని కేజీవ్రాల్ పేర్కొన్నారు. తాజా పరిణామంతో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌నకు మద్దతుగా నిలిచిన 'ఇండియా' కూటమి మిత్రపక్షాల జాబితాలో తాజాగా ఆప్ చేరడం గమనార్హం. గతంలో సమాజ్‌వాదీ పార్టీ, శివసేన (యూబీటీ) కేజీవ్రాల్‌కు మద్దతు ప్రకటించాయి. గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న ఆప్.. ఆ తర్వాత జరిగిన హరియాణా ఎన్నికల్లో ఒంటరి పోరాటం చేసిన విషయం తెలిసిందే. ఢిల్లీలో మత్తం 70 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. 2015లో 67 స్థానాలు గెలుచుకొని తొలిసారి అధికారంలోకి వచ్చిన ఆప్.. ఆ తర్వాత 2020లో 62 సీట్లతో అధికారం నిలబెట్టుకుని ఇప్పుడు హ్యాట్రిక్ విజయం కోసం కృషిచేస్తోంది.

### ఢిల్లీలోని సీఎం బంగ్లా వద్ద
# హైడ్రామా

మొదటిపేజీ తరువాయి

ఈ నేపథ్యంలో బుధవారం రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్, ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ మీడియాతో కలిసి ఆ బంగ్లా వద్దకు వెళ్లారు. బీజేపీ ఆరోపణలు తప్పని నిరూపించేందుకు, 6 ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లోని బంగ్లాలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. అయితే అక్కడ భారీగా మోహరించిన పోలీసులు ఆప్ నేతలను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో వారు అక్కడ బైఠాయించి నిరసన తెలిపారు. కాగా, ఈ సందర్భంగా ఆప్ నేతలు సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్ బీజేపీపై మండిపడ్డారు. ఆ పార్టీ అబద్ధాలు బయటపడ్డాయని అన్నారు. 'సీఎం నివాసంలో బంగారు మరుగుదొడ్డి, స్విమ్మింగ్ పూల్, మినీ బార్ ఉన్నాయంటూ బీజేపీ నేతలు కొన్ని నెలలుగా గోల చేస్తున్నారు. ఇవాళ మీడియాతో పాటు ఇక్కడకు వచ్చాం. బీజేపీ నేతలు కూడా రావాలని కోరాం. వారు చెప్పిన బంగారు మరుగుదొడ్లు, స్విమ్మింగ్ పూల్ ఎక్కడ ఉన్నాయో చూడాలనుకున్నాం. అయితే పోలీసులు, వాటర్ ఫిరంగులను మోహరించారు. లోనికి అనుమతిస్తే అసలు నిజం బయటపడేది' అని అన్నారు. మరోవైపు ప్రధాని మోదీ అధికార నివాసం 'రాజ్ మహల్' అని ఆప్ నేతలు విమర్శించారు. దీని కోసం రూ.2,700 కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. దమ్ముంటే ప్రజా ధనంతో నిర్మించిన ప్రధాని లగ్జరీ హౌస్‌లోకి మీడియాను అనుమతించాలని బీజేపీకి సవాల్ చేశారు. ఆప్ నేతలు సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్ ఆ తర్వాత ప్రధాని నివాసం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

### రోడ్డు ప్రమాద బాధితులకు
# నగదు రహిత చికిత్సలు

మొదటిపేజీ తరువాయి

ప్రమాద ఘటన జరిగిన 24 గంటల్లోగా పోలీసులకు సమాచారాన్ని అందిస్తేనే ఈ స్కీం ద్వారా నగదు రహిత చికిత్సను పొందొచ్చని గడ్కరీ స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్నట్లు చెప్పారు. 2025 మార్చి నాటికి దేశవ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా హిట్ అండ్ రన్ కేసుల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియాను అందిస్తామని గడ్కరీ తెలిపారు. పలు రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులతో కేంద్ర మంత్రి గడ్కరీ మంగళవారం సమావేశమయ్యారు. సమావేశం అనంతరం ఢిల్లీలోని భారత్ మండపంలో మీడియాతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలకే తమ మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. 2024లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 1.8 లక్షల మంది చనిపోయారని.. అందులో 30 వేల మంది హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్లే మరణించినట్లు తెలిపారు. మృతుల్లో 66 శాతం మంది 18 నుంచి 34 ఏండ్ల మధ్య వయస్సుగల వారే ఉండటం బాధాకర విషయమన్నారు. ఇక స్కూళ్లు, కాలేజీల్లో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల తప్పుల వల్ల 10,000 మంది పిల్లలు చనిపోయారని గడ్కరీ వివరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తులు వాహనాలు నడపడం వల్ల మూడు వేల మంది మరణించినట్లు తెలిపారు.

### మహాకుంభమేళాకు దేశవిదేశాల నుంచి
# 40 కోట్ల మంది

మొదటిపేజీ తరువాయి

ఆ తర్వాత 2–3 రోజుల వరకు రైళ్లు నడుస్తాయి. అలాగే పవిత్ర పుణ్యక్షేత్రాలను కలుపుతూ 560 రింగ్ రైళ్లు నడుపనుంది. ప్రయాగరాజ్– అయోధ్య– వారాణసీ–ప్రయాగ్‌రాజ్, ప్రయాగరాజ్– సంగమ్ ప్రయాగ్– జాన్‌పూర్– ప్రయాగ్– ప్రయాగరాజ్, గోవింద్‌పురి– ప్రయాగరాజ్–చిత్రకూట్–గోవింద్‌పురి, ఝాన్సీ–గోవింద్‌పురి– ప్రయాగరాజ్– మాణిక్‌పూర్– చిత్రకూట్–ఝాన్సీ మార్గాల్లో వీటిని నడుపుతారు. ప్రయాగరాజ్ ప్రాంతంలోని మొత్తం 9 రైల్వే స్టేషన్లలో 560 టికెట్ కౌంటర్లను కూడా రైల్వే ఏర్పాటుచేస్తోంది. భక్తులు లక్షలాదిగా తరలిరానున్న నేపథ్యంలో రైల్వే రక్షణ దళం (ఆర్‌పీఎఫ్), రాష్ట్ర రైల్వే పోలీసుకు చెందిన 18 వేల మందికిపైగా సిబ్బందిని మోహరిస్తున్నట్లు ఉత్తర మధ్య రైల్వే అధికారులు వెల్లడించారు. ప్రయాణికులకు వైద్య సేవలు అందించడానికి ఆక్సిజన్ సిలిండర్లు, కాన్సంట్రేటర్లు, ఈసీజీ యంత్రాలతో ప్రయాగరాజ్ జంక్షన్‌లో అబ్జర్వేషన్ రూంను ఏర్పాటు చేశామన్నారు. కాగా మహాకుంభమేళాకు ఆదివారం బాంబు బెదిరింపు వచ్చింది. ఉగ్ర దాడిచేస్తానని, వెయ్యి మందిని చంపుతానని సోషల్ మీడియాలో పోస్టుచేసిన ఆయుషకుమార్ జైస్వాల్‌ను మహాకుంభ్ పోలీసులు అరెస్టు చేశారు. ఇతడు విద్యార్థి. బిహార్‌లోని షాదీజంగ్ వాసి. ఇన్‌స్టాగ్రాంలో నాసిర్ పఠాన్ అనే నకిలీ పేరుతో ఈ బెదిరింపు పోస్టు పెట్టి నేపాల్ పారిపోయాడు. తన పక్కింటిలోని నాసిర్ పఠాన్‌ను ఇరికించేందుకే ఆయుష్ ఆ పేరుతో పోస్టు పెట్టినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

# మళ్లీ పెరిగిన బంగారం ధరలు

అమరావతి,జనవరి8(తెలంగాణ వీణ):



పుత్తడి ధర మరోమారు పెరిగింది..! వరుసగా మూడు రోజులు స్థిరంగా కొనసాగిన బంగారం ధరలు బుధవారం మళ్లీ పెరిగాయి. 2024లో గోల్డ్ రన్ హై స్పీడ్‌లో సాగింది. ఈ 2025లో కూడా అంతకుమించి బంగారం పరుగులు తీస్తుందని వ్యాపారవేత్తలు అంటున్నారు. దేశీయ మార్కెట్లో రూ.90 వేలకు చేరే ఛాన్స్ ఉందంటున్నారు..! ప్రస్తుతం 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి పై రూ.100 పెరగగా, 24 క్యారెట్లపై రూ.110 పెరిగింది. బులియన్ మార్కెట్‌లో బుధవారం (జనవరి 8) 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.72,250గా.. 24 క్యారెట్ల ధర రూ.78,820గా ఉంది. మరోవైపు నిన్న భారీగా పెరిగిన వెండి ధర నేడు స్థిరంగా ఉంది. బులియన్ మార్కెట్‌లో కిలో వెండి రూ.92,500గా నమోదైంది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విశాఖ, విజయవాడలో కిలో వెండి రూ.లక్షగా కొనసాగుతోంది.

### ఫార్ములా కేసులో పైసా
# అవినీతి లేదు

మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో 90 లక్షల మంది మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తున్నట్లు ఢిల్లీ కాంగ్రెస్ నేతలు అబద్దాలు చెబుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ.. ఆనాడు డైరీ ఆవిష్కరణలు ఉద్యమ కేంద్రాలుగా ఉండేవని... నేటి డైరీ ఆవిష్కరణ తిరిగి బీఆర్‌ఎస్‌ను అధికారంలోకి వచ్చేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. రేవంత్ రెడ్డి సంవత్సర కాలంగా చేసింది ఎగవేతలు, కేసులే అని వ్యాఖ్యలు చేశారు. ఎనుముల రేవంత్ రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి అంటూ ఎద్దేవా చేశారు. డైవర్షన్‌లు తప్ప రేవంత్ రెడ్డి చేసింది ఏమిలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే రైతు భరోసా వేస్తారని ఆరోపించారు. అధికారంలోకి రాగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెన్షన్‌లు పెంచిందన్నారు.ఎవరు ప్రశ్నిస్తే వాళ్ళ మీద కేసులు పెట్టి అణిచివేసే ప్రయత్నం చేస్తున్నారు అంటూ ముఖ్యమంత్రిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి భూములకు ఆరులైన్ల రోడ్లు వేసుకుంటున్నారని.. అప్పులపై అసెంబ్లీలోనే ప్రభుత్వం నోరు మూయించామన్నారు. లగచర్ల రైతులకు అండగా కేటీఆర్ నిలబడ్డారని.. కేటీఆర్ ఉద్యమకారుడు, కార్యకర్తే అని తెలిపారు. ఆయనకు ఆపద వస్తే పార్టీ అంతా అండగా ఉండాలని కోరారు. కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టి అన్యాయంగా ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు. దృష్టి మళ్లింపు తప్ప ప్రజలకు రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఒక్కసారి రైతు భరోసా ఇచ్చి మళ్లీ ఎగ్గొడతారు. ఢిల్లీకి కమీషన్లు పంపేందుకు డబ్బులు ఉన్నాయి కానీ... పేదలకు ఇవ్వడానికి డబ్బులు లేవంటున్నారు. ప్రశ్నించినందుకే కేటీఆర్‌పై అక్రమ కేసులు పెడుతున్నారని హరీశ్‌రావు అన్నారు.

# అమెరికాలో మరోమారు కార్చిచ్చు

మొదటిపేజీ తరువాయి

ఇక్కడ సంపన్నవర్గాలు నివసించే ది పాలిసాడ్స్ ప్రాంతంలో కార్చిచ్చు చెలరేగింది. దాదాపు 3000 ఎకరాలు దగ్ధమయ్యాయి. దీంతో 30,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. చాలామంది తమ సామగ్రి, వాహనాలను అక్కడే వదిలేసి ప్రాణాలు కాపాడుకోవడానికి తరలివెళ్లారు. వీధుల్లో పొగ కమ్మేసింది. మరోవైపు ఒక్కసారిగా ప్రజలు రోడ్ల పైకి రావడంతో చాలాచోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇక్కడ కొండలపై ఉన్న రహదారులు ఇరుగ్గా ఉంటాయి. దీనికితోడు గాలులు ఎక్కువగా వీయడంతో మంటలు తొందరగా వ్యాపిస్తున్నాయి. రాత్రి వేళల్లో ఇక్కడ గంటకు 100 మైళ్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ స్పందిస్తూ.. 'చాలా నిర్మాణాలు కాలిపోయాయి. మరికొన్నిచోట్ల కూడా కార్చిచ్చులు పుట్టొచ్చని అగ్నిమాపక శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు‘ అని తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 13,000 నిర్మాణాలకు కార్చిచ్చు ముప్పున్నట్లు లాస్ ఏంజెలెస్ అగ్నిమాక అధికారి క్రిస్టీన్ క్రాఫ్లీ చెప్పారు. బెవర్లీ హిల్స్, హాలీవుడ్ హిల్స్, మలిబు, శాన్‌ఫెర్నాండో ప్రాంతాలకు కార్చిచ్చు వ్యాపించే ప్రమాదం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ్గి ÷ర్ అలర్ట్ లెవల్స్‌ను పెంచారు. దాదాపు 62,000 మంది ప్రజలు కొన్ని గంటలుగా విద్యుత్తు లేక ఇబ్బందిపడుతున్నారు. ఇక్కడ మంటలను ఆర్పడానికి విమానాలు, హెలికాప్టర్లు, బుల్డోజర్లను అధికారులు రప్పించారు. హాలీవుడ్ స్టార్లు టామ్ హాంక్స్, రీస్ విథర్స్పూన్, స్పెన్సర్ ప్రాట్, హెడీ మోంటాగ్ వంటి నటుల ఇళ్లు అగ్నికి ఆహుతైనట్లు తెలుస్తోంది. మరికొందరి ఇళ్లు కూడా అగ్నికీలలకు సమీపంలో ఉన్నట్లు తెలుస్తోంది. అధ్యక్షుడు జోబైడెన్ ఇక్కడి కార్చిచ్చుపై స్పందించారు. తరచూ అప్‌డేట్లు తెలుసుకొంటున్నట్లు వెల్లడించారు. అక్కడి ప్రజలకు అవసరమైన అన్నిరకాల సాయాలను శ్వేతసౌధం చేస్తుందన్నారు. స్థానిక అధికారులతో తన బృందం టచ్‌లో ఉన్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ్గ ÷ర్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ గ్రాంట్‌ను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అక్కడి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. స్థానిక అధికారుల సూచనలు పాటించాలని కోరారు.

### స్పేస్ నిర్మాణానికి
# ప్రధాని గ్రీన్ సిగ్నల్ :

మొదటిపేజీ తరువాయి

ఎంతో మంది గొప్ప శాస్త్రవేత్తల నాయకత్వంలో సంస్థ కీర్తిగాంచిందని, అలాంటి సంస్థలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇస్రో చాలా గొప్ప సంస్థ అని, గతంలో అనేక మంది గొప్ప నేతలు దీన్ని నడిపించారని, ఈ సంస్థలో భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఓ ప్రశ్నకు బదులిస్తూ.. తన నియామకం గురించి తొలుత ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ఫోన్ వచ్చినట్లు వీ నారాయణన్ చెప్పారు. ప్రధానియే అన్నీ డిసైడ్ చేస్తున్నారని, పీఎంవో తనను కాంటాక్ట్ అయ్యిందని, ప్రస్తుతం ఇస్రో చైర్మెన్ ఎస్ సోమనాథ్ కూడా తనకు ఫోన్ కాల్ చేశారని, కొత్త అపాయింట్మెంట్ గురించి చెప్పినట్లు ఆయన వెల్లడించారు. త్వరలో చేపట్టబోయే ఇస్రో ప్రాజెక్టుల గురించి మాట్లాడుతూ.. ఇస్రో చాలా కీలకమైన మిషన్లను చేపడుతున్నదని, ప్రస్తుతం ఇస్రో విజయవంతమైన దశలో వెళ్తోందన్నారు. చేపట్టబోయే ప్రాజెక్టుల గురించి వివరిస్తూ.. స్పేడెక్స్ మిషన్‌ను డిసెంబర్ 30వ తేదీన చేపట్టామని, జనవరి 9వ తేదీన స్పేడెక్స్ శాటిలైట్ల డాకింగ్ జరగనున్నట్లు ఆయన తెలిపారు. గగన్‌యాన్ కూడా ఇస్రో ముందున్న అతిపెద్ద ప్రోగ్రామ్ అని పేర్కొన్నారు. క్రూ లేకుండా మాడ్యూల్‌ను ప్రయోగించే దాని కోసం ఇస్రోలో పనులు జరుగుతున్నాయన్నారు. జీఎస్ఎల్వీ ద్వారా ఎన్వీఎస్ 02 నావిగేషన్ శాటిలైట్ను పంపేందుకు శ్రీహరికోటలో వర్క్ జరుగుతోందన్నారు. ఇస్రో మాక్ 3 వెహికిల్ ద్వారా అమెరికాకు చెందిన కమర్షియల్ శాటిలైట్‌ను కూడా ప్రయోగించనున్నారు. గగన్‌యాన్ రాకెట్ అసెంబ్లింగ్‌కు చెందిన పనులు కూడా శ్రీహరికోట్లో ప్రోగ్రెస్ అవుతున్నాయి. చంద్రయాన్3 ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండ్ అయిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. చంద్రయాన్ 4 ద్వారా ఆ ప్రదేశంలో చంద్రుడిపై ల్యాండ్ అయి, శ్యాంపిళ్లు సేకరించిన తర్వాత మళ్లీ తిరిగి వచ్చే రీతిలో పనులు జరుగుతున్నాయన్నారు. భారత స్పేస్ స్టేషన్ని సెటప్ చేసేందుకు ప్లాన్ జరుగుతోందన్నారు. స్పేస్ స్టేషన్ నిర్మాణం కోసం ప్రధాని మోదీ అనుమతి కూడా తమకు దక్కిందన్నారు. స్పేస్ స్టేషన్‌కు అయిదు మాడ్యూళ్లు ఉంటాయని, 2028లో స్పేస్ స్టేషన్‌కు తొలి మాడ్యూల్‌ను లాంచ్ చేసే రీతిలో అనుమతి దక్కిందన్నారు.

మొదటిపేజీ తరువాయి

### రూ.2,600 కోట్లతో గ్రామీణ రహదారుల
# నిర్మాణం

ఎర్రమంజిలోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో రూరల్ ఇంజనీర్లతో మంత్రి సీతక్క బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఇంజినీర్ ఇన్ చీఫ్ కనక రత్నం, చీఫ్ ఇంజనీర్లు, సీఈలు, ఈఈలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రోడ్ల నిర్వహణ కోసం రూ.1600 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఇందుకు అనుగుణంగా రూరల్ ఇంజనీర్లు కార్యాచరణ సిద్ధం చేయాలని, కొత్త రహదారుల నిర్మాణ అంచనాలు పక్కాగా ఉండాలని సూచించారు. ఇష్టా రీతినా అంచనాలను సవరించొద్దని తెలిపారు. 30 మెట్రిక్ టన్నుల వాహనాలు నడిచేలా రోడ్ల సామర్థ్యాన్ని మెరుగుపరచాలని అన్నారు. ఇంజనీర్లే ఈ దేశ నిర్మాతలని అన్న మంత్రి మోక్షగుండం విశ్వేశ్వరయ్య, కాకతీయుల కాలం నాడు కట్టిన కట్టడాలు ఇంకా పటిష్టంగా ఉన్నాయని గుర్తు చేశారు. అదే రీతిన గ్రామీణ ప్రాంతాల్లోని ఇంజనీర్లు కట్టే నిర్మాణాలు 10 తరాలు ఉండేవిధంగా చూడాలని పేర్కొన్నారు. మహానగరాల్లో రోడ్లు మెరిసినట్టుగానే ప్లలెల్లో రహదారులు మెరవాలని, ఆ బాధ్యత గ్రామీణ విభాగానికి చెందిన ఇంజినీరింగ్ అధికారులదేనని అన్నారు. పెరుగుతున్న రవాణా అవసరాలకు అనుగుణంగా రహదారుల నిర్మాణం జరగాలని అన్నారు. నాణ్యతపై రాజీ పడొద్దని, జిల్లా స్థాయిలో రూరల్ ఇంజనీర్లు ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహించాలని అన్నారు. పనుల పురోగతి నివేదికలను ప్రతి 15 రోజులకు నివేదించాలని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గుండివాగు బ్రిడ్జి 10 ఏండ్లుగా పూర్తికాలేదని, దీనివల్ల 40 మంది ప్రజలు వాగు దాటలేక మృత్యువాత పడ్డారని మంత్రి అన్నారు. గతంలో తన నియోజకవర్గంలో సరైన గ్రామీణ రోడ్లు లేక ఎంతో మంది ఆత్మీయులను రోడ్డు ప్రమాదంలో కోల్పోయానని చెప్పారు. పట్టణాల్లో్గ స్కై ఓవర్లు ఉన్నాయి, కానీ చాలా గ్రామాల్లో కనీస రోడ్డు సదుపాయం లేకపోవడం బాధాకరమని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. మారుమూల ప్లలెలకు రహదారి సౌకర్యం కలిగిస్తేనే అసలైన అభివృద్ధి అని పేర్కొన్నారు. ఎస్టి వర్గానికి చెందిన తనకు పంచాయతీరాజ్ శాఖ అప్పగించారని అన్నారు. రూరల్ ఇంజనీర్లు సహకారం ఉంటే ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని అన్నారు.

తెలంగాణ వీణ
తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
8328209811

# విద్యార్థినీల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన సదాశివ పాఠశాల ప్రిన్సిపాల్ ను అరెస్ట్ చేయాలి...

## సదాశివ పాఠశాల ఉదంతంపై విచారణ జరపాలని ఎంఈఓకు వినతి..

## విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి డిమాండ్

**తెలంగాణవీణ, కాప్రా**

కాప్రా మండలంలోని ఈసీఐఎల్, ఏఎస్ రావు నగర్ లోని సదాశివ హైస్కూల్ లో పదో తరగతి విద్యార్థినుల పట్ల సదరు పాఠశాల ప్రిన్సిపాల్ బొర్రా నాగేంద్ర రావు అసభ్యకరంగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ విద్యార్థి, యువజన, మహిళా సంఘాల ఆధ్వర్యంలో బధవారం పాఠశాల ముందు ధర్నా నిర్వహించి, చట్ట ప్రకారం నాగేంద్ర ను సత్వరమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర,ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివానంద్, బీజే వై ఎం జిల్లా కార్యదర్శి అరుణ్ కుమార్,యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి లింగం, ఎన్ ఎస్ యూఐ ఉప్పల్ అసెంబ్లీ అధ్యక్షుడు కిషోర్ లు మాట్లాడుతూ విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు ఆ గురుతర బాధ్యతను మర్చి నీచంగా సభ్య సమాజం తలదించుకునేలా ప్రవర్తించడం సిగ్గు చేటు అన్నారు. దేశంలో ఇన్ని చట్టాలు రోజురోజుకూ కఠిన తరం అవుతున్నా ఇలాంటి ఘటనలు పునరావృతం అవ్వడం బాధాకరమని అన్నారు. 10వ తరగతి విద్యార్థుల చదువుల పట్ల మార్కులను, ర్యాంకులను సాదించడానికి కాసింత బాధ్యతను సదరు ప్రధానోపాధ్యాయులు కనబర్చిన నేపథ్యం బాగుందని, కానీ ఆ బాధ్యతను మర్చి స్పెషల్ క్లాసుల పేరిట విద్యార్థినుల పట్ల వ్యవహరించిన తీరు ఆపేక్షనీయమన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు, పోలీసు యంత్రాంగం దృష్టి సారించి ఈ కేసును నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి ఆరోపణలు ఎదుర్కొంటున్న నాగేంద్ర పై పూర్తి స్థాయి సాక్ష్యాలు సేకరించి న్యాయస్థానంలో బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ వై ఎఫ్ నేతలు స్వప్న, బిందు, తరుణ్,రవి, కిరణ్లతో పాటు తదితరులు పాల్గొన్నారు.




**కాప్రా మండల విద్యాశాఖ అధికారికి వినతి**

సదాశివ పాఠశాల అంశంపై కాప్రా మండల విద్యాశాఖ అధికారి బాపు రెడ్డి కి నేతల బృందం వినతిపత్రం అందజేశారు. సదరు పాఠశాలపై పూర్తి స్థాయి విచారణ జరపాలని, కాప్రా మండల వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో స్పెషల్ క్లాసుల పేరిట 10వ విద్యార్థుల పట్ల కనబరుస్తున్న వైఖరిపై ఆయా పాఠశాలల యాజమాన్యం కు ఆదేశాలు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. ఎక్కువ గంటల చదువు ఒత్తిడి తేవద్దని వారు కోరారు.

# మల్కాజిగిరిలో ఆధ్యాత్మిక సంరంభం...

## ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా

## అఖండ విష్ణు సహస్రనామ పారాయణం...

**తెలంగాణవీణ, మల్కాజిగిరి**

వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఈ నెల 10న సుమారు 3000 మందితో 12 పర్యాయాలు విష్ణు సహస్రనామ పారాయణం ఆనంద్ బాగ్ బృందావన్ గార్డెన్ లో నిర్వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామికి ఉదయాస్తమ సేవలు తిరుపతిలో జరిగిన విధంగా , విష్ణు సహస్రనామ పారాయణం మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు జరుగనుందని నిర్వాహకులు తెలిపారు. ఇది ఒక అద్భుతమైన కార్యక్రమం గత ఏడాది కంచి కామకోటి పీఠాధిపతి కార్యక్రమానికి వచ్చారనీ, రెండు రాష్ట్రాల్లో ఇప్పటివరకు ఒకే వేదికపై ఇలాంటి మహోత్తరమైన కార్యక్రమాన్ని గత రెండు పర్యాయాలు బృందావన్ గార్డెన్ లో విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. 10 వ తేదిన జరిగే విష్ణు సహస్కనామ పారాయణ కార్యక్రమానికి కుటుంబ సమేతంగా విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.



# ఈసినగర్ సోసైటి అధ్యక్షుడుగా శ్రవణ్ కుమార్ గౌడ్...

**తెలంగాణవీణ, కాప్రా**


చర్లపల్లి డివిజన్ ఈసిఐఎల్ హౌజ్ బిల్డింగ్ సోసైటి మ్యానేజింగ్ కమిటిని బుదవారం ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి డిప్యూటి రిజిస్టార్ పి.ఈశ్వరయ్య అధ్వర్యంలో సోసైటి ఎన్నికల్లో డైరెక్టర్లుగా గెలుపొందిన వారికి ఎన్నిక నిర్వహించారు. బూడిద శ్రావణ్ కుమార్ గౌడ్ ను అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోసైటి ఉపాధ్యాక్షురాలుగా సిహెచ్.పద్మిని, కార్యదర్శిగా ఎమ్.జగ్గారాజు, కోషాధికారిగా కె.ఇందిరలను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా పి.బిక్షపతి, ఏవీఎస్ వర్మ బి.బాలయ్యలు ఉన్నారు. ఎన్నికల అధికారి ఈశ్వరయ్య నూతన కమిటితో ప్రమాణస్వీకారం చేయించారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాలనీవాసులు, అధికారులు ప్రజాప్రతినిదుల సహకారంతో ఈసినగర్ కాలనీ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.



# బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా పిఆర్జిటిఏ క్యాలెండర్ ఆవిష్కరణ

**తెలంగాణ వీణ/తార్నాక:**

ప్రోగ్రెసివ్ రికాగ్నాయిస్డ్ గురుకుల టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వేమిరెడ్డి దిలీప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గురుకుల ఉపాధ్యాయుల ఏకైక గొంతుకైనా -ప్రోగ్రెసివ్ రికాగ్నాయిస్డ్ గురుకుల టీచర్స్ అసోసియేషన్ సంఘం బిసి గురుకులాల క్యాలెండర్ తెలంగాణ రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ చే ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పి ఆర్ జీ టి ఏ జాయింట్ సెక్రెటరీ ఉప్పు అశోక్, నిర్మలానందం, ప్రోగ్రెసివ్ రికాగ్నాయిస్డ్ గురుకుల టీచర్స్ అసోసియేషన్ బీసీ గురుకులాల అధ్యక్షులు శ్రీ గుర్రం రమేష్ గౌడ్,సోషల్ వెల్ఫేర్ గురుకులాల వైస్ ప్రెసిడెంట్ బి.రాజు మైనారిటీ గురుకులాల ప్రధాన కార్యదర్శి లక్ష్మారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సంజీవరెడ్డి తదితరులు పాల్గొనడం జరిగింది.



# సమావేశం లో సభ్యుల నుంచి అభిప్రాయాల సేకరన

**తెలంగానా వీనా హైదరాబాద్**

బీజేపీ అనుసరిస్తున్న విధానాల పై కఠినంగా వ్యవహరించాలని పి ఏ సి కన్వీనర్ షబ్బీర్ అలీ తెలిపారు. అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా పై దేశ వ్యాప్తంగా నిరసనలు చేస్తాము మహాత్మ గాంధి ఆలోచనలను కొత్త తరానికి తెలియచేయడానికి జనవరి 2025..జనవరి 2026 సంవత్సర కాలం పాటు కార్యక్రమాలతో ముందుకు వెళతామ న్నారు.

ఎన్నికల్లో పార్టీ ఇచ్చిన ఒక్కో హామీని అమలు చేసుకుంటూ వస్తున్నామని జనవరి 26 నుండి పెట్టుబడి సాయం ఇస్తామన్నారు. రైతుల గురించి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలపై చర్చ జరిగింది. ఒక్క సంవత్సరం లోనే రైతుల కోసం యబై వేల కోట్లు ఖర్చు పెట్టామన్నారు. కుల గణన పై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ను కే సి వేణుగోపాల్ అభినందించారు. గ్రామ మండల జిల్లా రాష్ట్ర స్థాయి కమిటీలు ఏర్పాటు చేసుకుని ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. పార్టీ కోసం పని చేసిన వారికి పదవులు ఇవ్వాలని వారు సూచించారు. త్వరలోనే పార్టీ పదవులు,కార్పొరేషన్ చైర్మన్ లు భర్తీ చేస్తాము. కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

# మైనంపల్లి హనుమంతరావు పుట్టినరోజు సందర్భంగా బంగారమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు

**తెలంగాణ వీణ,చేగుంట**

మల్కాజ్గిరి మాజీ శాసనసభ్యులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావు ముందస్తు జన్మదిన వేడుకలు పాల్గొన్న దుబ్బాక ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి,సిద్దిపేట ఇంచార్జ్ పూజల హరికృష్ణ, పార్టీ సీనియర్ నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించారు,మనోహరాబాద్ జాతీయ రహదారి పక్కనే ఉన్న బంగారమ్మ దేవాలయంలో బుధవారం నాడు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావు, మనోహరాబాద్ మాజీ సర్పంచ్ చిట్కుల మైపాల్ రెడ్డి,ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు, సీనియర్ నాయకులు ఆధ్వర్యంలో మైనంపల్లిని ప్రత్యేకంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు, ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు,



# వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను పరిశీలించిన కార్పొరేటర్ ...

**తెలంగాణవీణ, కాప్రా**

కాప్రా సర్కిల్ మీర్పేట్ హెచ్.బీ కాలనీ డివిజన్ పరిధిలోని మంగాపురం కాలనీ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 10 వైకుంఠ ఏకాదశి, రాబోయే బ్రహ్మోత్సవాలను పురస్కరించి స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ బుధవారం ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను సమిక్షించారు. వైకుంఠ ఏకాదశి తో పాటు ఆలయ బ్రహ్మోత్సవాల దృష్ట్యా ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. సందర్భంగా ప్రభుదాసు మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి , బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహణ కార్యక్రమాలు ఏ విధంగా జరుపుకోవాలని భక్తులకు ఏ విధమైన అసౌకర్యం జరగకుండా తీసుకోవల్సిన అంశాలపై ఆలయ కమిటీ సభ్యులతో చర్చించారు. కార్యక్రమంలో ఉల్లెం బాలరాజ్, విక్రమ్, అశోక్ రెడ్డి, రాజశేఖర్, రామక్రిష్ణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





# నీళ్లకోసం తండ్లాట

## ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించిన మహిళలు

**నాగర్‌కర్నూల్, జనవరి 8 (తెలంగాణ వీణ):**

కాంగ్రెస్ పాలనలో తాగునీటి కోసం ప్రజలు తంటాలుపడుతున్నారు. ప్రజా సంక్షేమాన్ని మరిచి పార్టీ ఫిరాయింపులు, ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు పెట్టడంలో ప్రభుత్వం బిజీగా దీంతో పాలనా పడకేయడంతో జనం ఇబ్బంది పడుతున్నారు. గుక్కెడు నీళ్ల కోసం మైళ్ల దూరం ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. తాజాగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం రామాపురం గ్రామంలోని ఏడో వార్డులో ప్రజలు అవస్థలు పడుతున్నారు. నెల రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో చాలా దూరం నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీళ్ల సమస్య తీర్చాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.




# కేరళ ఉత్సవాల్లో అపశృతి

## ఏనుగు బీభత్సం... 17 మందికి గాయాలు

**తిరువనంతపురం, జనవరి 8 (తెలంగాణ వీణ):**

కేరళ రాష్ట్రంలో నిర్వహించిన ఉత్సవాల్లో అపశృతి చోటు చేసుకుంది. ఉత్సవాల కోసం తీసుకొచ్చిన ఏనుగుల్లో ఒకటి జనాలపైకి దూసుకెళ్లి బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో 17 మంది గాయపడ్డారు. బుధవారం తెల్లవారుజామున 12:30 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మలప్పురంలోని బీపీ అంగడి వద్ద మంగళవారం రాత్రి వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఏనుగులను తీసుకొచ్చారు. ఉత్సవాలు జరుగుతుండగా.. ఉన్నట్టుండి ఓ ఏనుగు బీభత్సం సృష్టించింది. పెద్ద పెద్దగా శబ్దాలు చేస్తూ.. జనాల్లోకి దూసుకెళ్లింది. ఓ వ్యక్తిని తొండంతో ఎత్తి పక్కకు పడేసింది. ఈ ఘటనలో సదరు వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు తెలిసింది. ప్రస్తుతం అతడికి కొట్టకల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కాగా, ఏనుగు ఒక్కసారిగా బీభత్సం సృష్టించడంతో జాతరకు వచ్చిన ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఏనుగు దాడి నుంచి తప్పించుకునేందుకు పరుగులు తీశారు. ఈ క్రమంలో అక్కడ తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ దుర్ఘటనలో సుమారు 17 మందికిపైగా గాయపడినట్లు స్థానిక అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని ఏనుగును బంధించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు.



# మహిళల శరీరంపై కామెంట్స్ చేస్తే అది లైంగిక వేధింపే : కేరళ హైకోర్టు

**కొచ్చి, జనవరి 8 (తెలంగాణ వీణ):**

మహిళల శరీరం నిర్మాణంపై ఎటువంటి వ్యాఖ్యలు చేసినా.. అది లైంగిక వేధింపు అవుతుందని కేరళ హైకోర్టు పేర్కొన్నది. జస్టిస్ ఏ బదరుద్దీన్ ఈ తీర్పును ఇచ్చారు. కేరళ విద్యుత్తు శాఖకు చెందిన ఓ మహిళా ఉద్యోగినిపై మరో ఉద్యోగి కామెంట్ చేశారు. దీంతో ఆమె లైంగిక వేధింపుల కేసు నమోదు చేసింది. ఆ కేసును కొట్టివేయాలని కోరుతూ ఆ ఉద్యోగి కోర్టును ఆశ్రయించాడు. 2013 నుంచి ఆ ఉద్యోగి చాలా అసభ్యకరమైన భాషను వాడారని, 2017లో అభ్యంతరకరమైన మెసేజ్‌లు, వాయిస్ కాల్స్ చేసేవాడని ఆమె ఆరోపించింది. విద్యుత్తు శాఖకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. మహిళా ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఐపీసీలోని సెక్షన్ 354ఏ(లైంగిక వేధింపులు), 509(మహిళను కించపరచడం), సెక్షన్120(ఓ) కింద కేసు బుక్ చేశారు. కేరళ పోలీసు చట్టంలోని సెక్షన్ 120(ఓ) కింద కూడా ఆ ఉద్యోగి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కోర్టు పేర్కొన్నది. అయితే కేవలం శరీర శౌష్టవం బాగుందని కామెంట్ చేసినంత మాత్రానా.. తనపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారని, ఆకేసును కొట్టివేయాలని విద్యుత్తు శాఖ ఉద్యోగి కోర్టును ఆశ్రయించారు. కాల్స్, మెసేజ్‌లతో నిందిత వ్యక్తి లైంగిక వేధింపుల కామెంట్స్ చేసినట్లు మహిళా ఉద్యోగి ఆరోపించింది. అయితే ఐపీసీలోని సెక్షన్ 354ఏ, 509తో పాటు సెక్షన్ 120 కేరళ పోలీసు చట్టం ప్రకారం నిందితుడిపై తగిన ఆధారాలు ఉన్నట్లు హైకోర్టు తెలిపింది.




# గౌతం అదానీపై అమెరికాలో విచారణ

**న్యూఢిల్లీ, జనవరి 8 (తెలంగాణ వీణ):**

బిలియనీర్ గౌతం అదానీ, ఆయన కంపెనీలపై విచారణ చేపట్టేందుకు ఇటీవల అమెరికా సర్కారు నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ముడుపులు చెల్లించిన కేసులో అమెరికా కోర్టు అదానీని నిలదీసింది. అయితే భారతీయ వ్యాపారిపై అమెరికా న్యాయశాఖ తీసుకున్న నిర్ణయాన్ని రిపబ్లికన్ నేత తప్పుపట్టారు. ఎంపిక చేసుకుని ఓ వ్యక్తిని టార్గెట్ చేయడం వల్ల.. భాగస్వామ్య దేశాలతో బంధాలు దెబ్బతింటాయని ఆ నేత పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అమెరికా అటార్నీ జనరల్ మెర్రిక్ బీ గార్లాండ్‌కు లేఖ రాశారు లాన్స్ గూడెన్. విదేశీ వ్యక్తులను ఎంచుకుని ఎందుకు టార్గెట్ చేస్తున్నారని న్యాయశాఖను డిమాండ్ చేశారాయన. అదానీ విచారణ వెనుక ఏదైనా లోగుట్టు ఉన్నాదా అని, దీని వెనుక జార్జ్ సోరస్ లాంటి వ్యక్తి ఉన్నారా అని రిపబ్లికన్ నేత ప్రశ్నించారు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అమెరికాకు బలమైన భాగస్వామిగా ఇండియా ఉన్నదని, టార్గెట్ చేసి చర్యలు తీసుకోవడం వల్ల భాగస్వామ్య కూటమి దెబ్బతినే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. దేశంలోని చెడు వ్యక్తులను ముందుగా అమెరికా న్యాయశాఖ శిక్షించాలని, విదేశీ వ్యక్తులను కాదు అని గూడెన్ పేర్కొన్నారు. వందల కోట్ల డాలర్లు పెట్టుబడి పెటి, అమెరికన్ల కోసం లక్షలాది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నవారిని టార్గెట్ చేయడం వల్ల దీర్ఘకాలంలో అమెరికాకే నష్టం జరుగుతుందని గూడెన్ తన లేఖలో తెలిపారు. ఒకవేళ అదానీపై ఆరోపణలు నిజమైనా, వాటిని నిరూపించినా, ఆ అంశంలో అమెరికా పాత్ర ఏముంటుందని గూడెన్ ప్రశ్నించారు. అదానీ సంస్థ భారత్‌లో అక్కడి అధికారులకు లంచాలు ఇచ్చిందని, ఓ భారతీయ కంపెనీ ఆ లావాదేవీలకు పాల్పడిందని, దీంట్లో అమెరికా వ్యక్తుల ప్రమేయం ఏమి ఉందని గూడెన్ తన లేఖలో తెలిపారు. అమెరికా వ్యక్తుల ప్రమేయం లేనప్పుడు.. విదేశీ వ్యక్తులను విచారించేందుకు న్యాయశాఖ ఎందుకు ఉత్సాహాన్ని ప్రదర్శిస్తుందని ఆయన





అడిగారు. అదానీ ముడుపుల కేసులో ఏ ఒక్క అమెరికా వ్యక్తి లేకపోవడం ఏంటని న్యాయశాఖను ప్రశ్నించారు. ఇండియాలో అవినీతి జరిగితే, అదానీపై అమెరికాలో కేసు ఎందుకు రిజిస్టర్ చేసినట్లు న్యాయశాఖను నిలదీశారు. మీరేమైనా ఇండియాలో న్యాయం కోసం వత్తిడి తెస్తున్నారా అని అడిగారు. ఈ కేసులో నిమగ్నమైన భారతీయ అధికారులను అమెరికాకు రప్పిస్తారా అని ప్రశ్నించారు. ఒకవేళ అవినీతి అధికారుల్ని అప్పగించేందుకు భారత్ నిరాకరిస్తే, అప్పుడు అమెరికా న్యాయశాఖ వద్ద ఉన్న ఆప్షన్ ఏంటని అడిగారు. అమెరికా, భారత్ మధ్య చిచ్చు పెట్టి, బైడెన్ సర్కారు అదానీ కేసును అంతర్జాతీయం చేయాలని చూస్తున్నదా అని రిపబ్లికన్ నేత గూడెన్ ప్రశ్నించారు.

# నీరుగారుతున్న ప్రజా పంపిణీ వ్యవస్థ లక్ష్యం

## ఆహారధాన్యాల ఉత్పత్తి పెరిగినా తగ్గని పేదరికం

## కేంద్ర, రాష్ట్రాల తీరుతో మోసపోతున్న జనం

**న్యూఢిల్లీ,జనవరి8(తెలంగాణ వీణ):**

ప్రజా పంపిణీ వ్యవస్థ లక్ష్యం నీరుగారింది. ఆహారధాన్యాల ఉత్పత్తి పెరిగినా పేదరికం మాత్రం తగ్గడం లేదు. ఏటికేడు ఉచిత పథకాల రూపకల్పన దీనిని సూచిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరుతో జనం మోసపోతున్నారు. పేదరికం పెరగడంతో రక్తహీనత, తల్లీబిడ్డల మరణాలు పెరిగిపోయాయి. దీంతో జాతీయ ఆహార భద్రత చట్టం ద్వారా గ్రామీణ జనాభాలో 75 శాతం, పట్టణ జనాభాలో 50 శాతం మందికి సబ్సిడీ ధాన్యం అందివ్వాలని కేంద్రం నిర్ణయించింది. కరోనా సమయంలో ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కింద 2020 జనవరి 1నుండి ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. ఇంత కాలంగా ఆహార ధాన్యాల సబ్సిడీ అందిస్తున్న పేదరికం, ఆకలి బాధలు తగ్గకపోగా పెరిగాయి. ప్రపంచ ఆకలి సూచికలో 156 దేశాల్లో మన దేశం 110వ స్థానంలో ఉంది. సార్వత్రిక ప్రజా పంపిణీ విధానం అమలు చేయడం దీనికి కీలక పరిష్కారం అని సూచనలు వస్తున్నా కేంద్రం పెడచెవిన పెడుతోంది. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీష్ ప్రభుత్వం తమ వ్యాపార, కంపెనీల ప్రయోజనాల కోసం ఆహార పంటల సాగును తగ్గించి, వాణిజ్య పంటలను బలవంతాన అమలు చేయించారు. చరిత్రలో ఎన్నడూ ఎరగని ఆకలి, కరువులతో కోట్ల మంది భారతీయులు చనిపోయారు. స్వాతంత్ర్యానంతరం కేంద్ర ప్రభుత్వం ఆహార పంటల అభివృద్ధికి కొన్ని చర్యలు చేపట్టినా, ప్రజల ఆకలి బాధలను తీర్చలేకపోయింది. మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు 1960వ దశకంలో చైనా, పాకిస్తాన్‌లతో వచ్చిన యుద్ధాలు ఆహారధాన్యాల సమస్యను మరింత తీవ్రం చేశాయి. తిండిగింజల కొరత పెరిగింది. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రజా పంపిణీ వ్యవస్థ ఆవిర్భ వించింది. 1964లో ఆహారధాన్యాల కమిటీని ఏర్పాటు చేసి ఒకవైపు ఆహారధాన్యాల ధరల పెరుగుదలను, అక్రమ నిల్వలను అరికట్టడం, మరోవైపు పేదలకు తక్కువ ధరకు ఆహారధాన్యాలు అందించడం ప్రారంభించారు. హరిత విప్లవం తర్వాత 1970-80 మధ్య గిరిజన ప్రాంత ప్రజలకు, క్రమంగా గ్రామ, పట్టణ పేదలకు విస్తరించారు. 1992 జూన్ నుండి పునరుద్ధ రించబడిన ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కరువు పీడిత ప్రాంతాలు, గిరిజన, ఎడారి ఉన్న 1775 ప్రాంతాల్లో ఈ పథకం ద్వారా బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు అందించారు. 1977 నుండి లక్షిత ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సబ్సిడీ ఆహార ధాన్యాలు అందించారు. దారిద్య రేఖకు దిగువన ఉన్న వారికి కుటుంబానికి 20 కిలోల చొప్పున బియ్యం, పేదల్లో మరింత పేదరికంలో వున్న వారికి 2002 నుండి అంత్యోదయ అన్న యోజన పథకం ద్వారా కటుంబానికి 35 కిలోలు ఇచ్చారు. ఎన్.టి.రామరావు అధికారం లోకి వచ్చిన తర్వాత ప్రారంభించిన రేషన్ బియ్యం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఈ పథకాన్ని రద్దు చేయాలని ప్రయ త్నించిన కాంగ్రెసు తర్వాతి కాలంలో రూపాయికే కిలో బియ్యం హామీ ఇవ్వాల్సి వచ్చింది. చంద్రబాబు ఈ బియ్యం పథకాన్ని కుదించడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. . వైసిపి పాలనలో ఇంటి వద్దకే బియ్యం అందించాల్సి వచ్చింది. ఇంత చేసినా రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 54 శాతం మందికి మాత్రమే రేషన్ బియ్యం అందుతుంది. 2020 జనాభా ఆధారంగా చూస్తే 50 శాతం మందికి మాత్రమే అందుతుంది. బియ్యంతో పాటు, చక్కెర, కందిపప్పు, ఆయిల్, కిరోసిన్ లాంటి సరుకులు ఇవ్వాల్సి వుండగా బియ్యం మాత్రమే పంపిణీ అవుతుంది. పెరుగుతున్న ధరలు, తగ్గుతున్న ఉపాధితో జనం అల్లాడిపోతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుస్తామని చెబుతున్న పాలకులు పేదలకు అవసరమైన కనీస నిత్యావసర సరుకులను మాత్రం ప్రజా పంపిణీ ద్వారా అందించడం లేదు. లక్షల టన్నుల ధాన్యం భారత ఆహార సంస్థ గిడ్డంగుల్లో మగ్గిపోతున్న పేదలకు ఎందుకు పంచడం లేదని సుప్రీంకోర్టు ప్రశ్నించిన తర్వాత కూడా పాలకుల తీరు మారలేదు. కార్పొరేట్ కంపెనీలకు కోట్ల రాయితీలు ఇస్తున్న మోడీ ప్రభుత్వం రైతులను గట్టెక్కించే ప్రయత్నాలు చేయడం లేదు. దేశానికి సరిపడా తిండిగింజలు ఉత్పత్తి చేసేలా ప్రోత్సహించడం లేదు. దేశ ఆహార భద్రతలో కీలకంగా వ్యవహరిస్తున్న ఎఫ్‌సిఐ గోడౌన్లను మూసివేయడం లేదా ప్రైవేటీకరించడం ఈ ప్రభుత్వ విధానంగా కనిపిస్తోంది.గత 13 సంవత్సరాలుగా జనాభా లెక్కలు సేకరించకుండా 2011 లెక్కల ఆధారంగానే ప్రస్తుత ప్రజా పంపిణీ అమలు చేస్తున్నారు. ఒకే దేశం-ఒకే రేషన్ కార్డు అంటూ ఈ పథకాన్ని కుదించడానికి అనేక ప్రయత్నాలు కేంద్రం చేస్తోంది. 2013-14లో ఆహార సబ్సిడీ కోసం దేశ స్థూల జాతీయోత్పత్తిలో 0.8 శాతం ఖర్చు చేస్తుండగా, 2019-20లో 0.5 శాతానికి తగ్గించివేశారు. కరోనా సమయంలో అనివార్యంగా 2021-22లో 1.2 శాతానికి పెంచి ఆ తర్వాత 2023-24లో 0.7 శాతానికి తగ్గించివేశారు. ఎఫ్.సి.ఐ ద్వారా ఇస్తున్న సబ్సిడీకి 2021-22లో రూ.2,08,929 కోట్లు కేటాయించగా, 2023-24లో రూ. 1,37,207 కోట్లు మాత్రమే కేటాయించింది. దీనివల్ల బియ్యం, గోధుమల సేకరణ తగ్గింది. 2015-16లో 342.18 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించగా, 2022-23లో 434.83 మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించారు. ఇదే కాలంలో గోధుమల సేకరణ 57 శాతం తగ్గింది. ఇవన్నీ సమీక్షించి పక్కాగా పథకాలను అమలు చేయాల్సిన సమయం ఇది.

# ఆర్మీ కెప్టెన్‌గా చెప్పుకొని.. లక్షల్లో వసూలు

**లక్నో,జనవరి 8 (తెలంగాణ వీణ):**



ఒడిశాకు చెందిన 40 ఏళ్ల వ్యక్తి.. ఆర్మీ కెప్టెన్ అని చెప్పుకుంటూ.. మహిళల్ని మోసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాలాసోర్ జిల్లాకు చెందిన హైదర్ అలీ అనే వ్యక్తి.. రిలేషన్‌షిప్ పేరుతో మహిళలతో పరిచయం పెంచుకునేవాడు. ఆ తర్వాత వాళ్ల నుంచి లక్షల్లో డబ్బులు వసూల్ చేసేవాడు. పోలీసుల వివరాల ప్రకారం.. తన పేరు హర్తిక్ బిగ్లో అని, ఆర్మీ మెడికల్ కార్ప్స్ ఆఫీసర్‌ను అంటూ అతను పరిచయం చేసుకునేవాడు. ఆడవాళ్లతో పరిచయం పెంచుకున్నాక, ఏవేవో కారణాలు చెబుతూ వారి నుంచి డబ్బులు లాగేవాడు. డబ్బులు ముట్టిన తర్వాత ఇక అతను తన కమ్యూనికేషన్ ముగించేవాడు. ఆ తర్వాత మరో లొకేషన్‌కు వెళ్లి కొత్త టార్గెట్లను వెతికేవాడు అని తెలుస్తోంది. మహిళల్ని బెదిరించి వసూల్ చేసిన డబ్బుతో చాలా విలాసవంతమైన జీవితాన్ని గడిపేవాడు. అయితే లక్నోలో ఓ మహిళ పరిచయం అయిన తర్వాత సీన్ మారింది. అతనిపై పోలీసు ఫిర్యాదు ఇవ్వడంతో .. ఆ వ్యక్తి నాటకాలు బయటపడ్డాయి. హైదరాబాద్, కేరళ, కర్నాటక, బెంగాల్ రాష్ట్రాల్లో హైదర్ అలీ సెక్యూర్టీ సంస్థల్లో పనిచేశాడు. ప్రతి సిటీలోనూ అతను మహిళల్ని వంచించినట్లు తెలుస్తోంది. ఆర్మీ దుస్తుల్లో ఉన్న ఫోటోలను అతను ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్స్‌లో పోస్టు చేసేవాడు. ఇండియన్ కమాండో హార్దిక్, ఆర్మన్‌బిగ్లో, ఆర్మీబెగ్లో, సోల్జర్స్3889 పేర్లతో అతను ప్రొఫైల్స్ క్రియేట్ చేశాడు. ఆర్మీ దుస్తులు, త్రీస్టార్ ఫ్లాప్స్, ఆర్మీ బీరెట్, ఫేక్ ఆధార్ కార్డు, ఆర్మీ క్యాంటీన్ కార్డు లాంటి వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతనికి ఏమైనా క్రిమినల్ రికార్డు ఉందా లేదా అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. తనతో శారీరక సంబంధం పెట్టుకుని, డబ్బులు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదు ఇచ్చిన వ్యక్తి పేర్కొన్నట్లు పోలీసు అధికారి నిపున్ అగర్వాల్ తెలిపారు. మతాన్ని చెప్పకుండానే అందరితో పరిచయం పెంచుకున్నట్లు తెలిసింది. అతని కాల్ రికార్డులను పరిశీలిస్తున్నారు. నలుగురు మహిళలతో లింకు ఉన్నట్లు నిందితుడు అలీ చెప్పినట్లు పోలీసులు వెల్లడించారు.

# ముఖ్యమైన సవాళ్లలో జనాభా తగ్గుదల ఒకటి : ఎలాన్ మస్క్

**న్యూఢిల్లీ, జనవరి 8 (తెలంగాణ వీణ):**

ప్రపంచ వ్యాప్తంగా జనాభా తగ్గుదలపై అపరకుబేరుడు, టెస్లా బాస్ ఎలాన్ మస్క్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన సవాళ్లలో ఇది ఒకటిగా పేర్కొన్నారు. జనాభా క్షీణతకు సంబంధించిన ఓ గ్రాఫ్‌ను టెస్లా ఓనర్స్ సిలికాన్ వ్యాలీ ఎక్స్‌లో పోస్టు చేసింది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన భారత్, చైనా సహా నైజీరియా, అమెరికా, ఇండోనేషియా, పాకిస్థాన్ వంటి కీలక దేశాల్లో 2018 నుంచి 2100 మధ్య జనాభాలో ఎలాంటి మార్పులు ఉండనున్నాయనే దాన్ని ఈ గ్రాఫ్‌లో చూపించారు. ముఖ్యంగా భారత్, చైనా దేశాల్లో 2100 నాటికి జనాభా క్షీణత తీవ్రంగా ఉంటుందని ఆ గ్రాఫ్‌లో అంచనా వేశారు. ఈ గ్రాఫ్‌ను పోస్టు చేసిన టెస్లా ఓనర్స్ సిలికాన్ వ్యాలీ.. 'జనాభా తగ్గుదల మానవాళికి అత్యంత ముప్పు' అని పేర్కొంది. ఈ ట్వీట్‌ను రీపోస్ట్ చేసిన మస్క్.. 'అవును' అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



# భారత భూభాగం ఆక్రమణ బంగ్లా కథనాలను తిప్పికొట్టిన బిఎస్ఎఫ్

**న్యూఢిల్లీ,జనవరి8(తెలంగాణ వీణ):**

భారత్‌లో 5 కిలోమీటర్ల మేరకు భూభాగాన్ని బంగ్లాదేశ్ సైన్యం ఆక్రమించుకొందన్న మీడియా కథనాలను సరిహద్దు భద్రతా దళం బీఎస్ఎఫ్ ఖండించింది. అవి పూర్తిగా బాధ్యతారాహిత్యమైన, ఆధార రహిత కథనాలని పేర్కొంది. 'నార్త్ 24 పరగణాస్ జిల్లాలో రాంఘాట్ గ్రామంలోని బగ్దా బ్లాక్‌లోని భూభాగంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ అంతర్జాతీయ సరిహద్దు కొడల్యా నదీ తీరం నుంచి వెళుతుంది. ఇరువైపులా కచ్చితమైన హద్దులను గుర్తించి స్తంభాలు పాతి వేసిన కంచె ఉంది. ఇక ఈ సరిహద్దు వెంట బీఎస్ఎఫ్ గస్తీలో ఎటువంటి మార్పు జరగలేదు. ఒక్క అంగుళం భారత భూభాగాన్ని తీసుకోలేదు, తీసుకోలేరు కూడా. 1975 భారత్ బంగ్లా బోర్డర్ గైడ్‌లైన్స్ ఆధారంగా బీఎస్ఎఫ్, బీజీబీ వాటి విధులను ప్రశాంతంగా నిర్వహిస్తున్నాయి' అని బీఎస్ఎఫ్ దక్షిణ బెంగాల్ ఫ్రంటియర్ పేర్కొంది. అంతేకాదు.. కంచె లేని చోట్ల కూడా బంగ్లాదేశీల చొరబాట్లు, స్మగ్లింగ్ వంటివి జరగకుండా కఠినచర్యలు తీసుకొన్నట్లు బీఎస్ఎఫ్ వివరించింది. బంగ్లాదేశ్‌కు చెందిన మీడియాలోని కొన్ని వర్గాలు నిరాధారంగా వీటిని ప్రచారం చేస్తున్నాయని బీఎస్ఎఫ్ అభిప్రాయపడింది. అంతేకాదు.. బోర్డర్ గార్డ్స్ బంగ్లాదేశ్ (బీజీబీ) మోటార్ బోట్లు, ఏటీవీలతో డిసెంబర్ 19 నుంచి గస్తీ మొదలుపెట్టిందన్న ప్రచారాన్ని కూడా కొట్టిపారేసింది. మాల్దా జిల్లాలో సుక్‌దేబ్‌పుర్‌లో సరిహద్దుల వెంట బీఎస్ఎఫ్, బీజీబీ గార్డ్స్‌కు మధ్య ఫెన్సింగ్ విషయంలో గొడవ జరిగింది. భారత్ వైపు కంచె నిర్మాణానికి బంగ్లాదేశ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ తర్వాత కొద్దిసేపటికే అక్కడ గ్రామాల్లో ప్రజలు చేరుకొని వందేమాతరం, భారత్ మాతాకీ జై వంటి నినాదాలు చేశారు. ఆ తర్వాత బీఎస్ఎఫ్ దళాలు స్పందిస్తూ ముందస్తుగా ఇరుదేశాలు చేసుకొన్న ఒప్పందం ప్రకారం దానిని నిర్మిస్తున్నట్లు బీజీబీకి నచ్చజెప్పారు. ఆ తర్వాత తిరిగి కంచె పనులు మొదలు పెట్టారు.

# వేడెక్కిన ఢిల్లీ ఎన్నికల ప్రచారం

## 25 లక్షల ఆరోగ్యబీమా ప్రకటించిన కాంగ్రెస్ - శీష్‌మహల్ విమర్శలపై ఆప్, బిజెపిల ఆందోళన

**న్యూఢిల్లీ,జనవరి8(తెలంగాణ వీణ):**

దేశ రాజధాని దిల్లీ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన క్రమంలో కాంగ్రెస్ దిల్లీ వాసులకు హామీల వర్షం కురిపిస్తోంది. తాజాగా 'జీవన్ రక్ష యోజన' అనే పథకాన్ని కాంగ్రెస్ ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.25లక్షల ఆరోగ్యబీమా కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కాంగ్రెస్ సీనియర్ నేత, రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గహ్లోత్ బుధవారం ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. రాజస్థాన్‌లో తాము అధికారంలో ఉన్నప్పుడు ఇదే పథకాన్ని అమలుచేశామని గుర్తుచేశారు. ఎలాంటి షరతులు, పరిమితులు లేకుండా దీన్ని అమలుచేసినట్లు తెలిపారు. దిల్లీకి ఈ పథకం ఓ గేమ్‌ఛేంజర్ అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే 'ప్యారీ దీదీ యోజన' పథకం కింద ప్రతి మహిళకు ప్రతి నెలా రూ.2,500 ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.ఇదిలాఉండగా.. దేశ రాజధాని దిల్లీలో జరిగే ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. మొత్తం 70 శాసనసభ స్థానాలకు ఫిబ్రవరి 5న ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడనున్నాయి. ఇదిలావుంటే అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో దిల్లీ రాజకీయాలు వేడెక్కాయి. ఆప్, భాజపా ఏ వేదికా వదలకుండా విమర్శలు చేసుకుంటున్నాయి. ఈ సమయంలో 'సీఎం బంగ్లా' వివాదం రాజకీయ దుమారం రేపుతోంది. ఈ బంగ్లాను 'శీష్ మహల్' అంటూ భాజపా చేస్తోన్న విమర్శలను ఆప్ తిప్పికొడుతోంది. తాజాగా 'నిజాన్ని చూపిస్తాం' అంటూ ఆ పార్టీ సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్ మీడియాను తీసుకొని ఆ అధికారిక నివాసం వద్దకు వెళ్లారు. అయితే వారి ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. మంత్రి, ఎంపీ అధికారాలను పోలీసులు అడ్డుకుంటున్నారని ఆప్ నేతలు మండిపడ్డారు. దాంతో సీఎం నివాసం ముందు గందరగోళ వాతావరణం నెలకొంది. ఆ అధికారిక నివాసంలోకి వెళ్లేందుకు ఆప్ నేతలకు అనుమతి లేదని పోలీసులు తేల్చిచెప్పారు. దానిలో భాగంగా బారికేడ్లు ఏర్పాటుచేశారు. భారీగా పోలీసులను మోహరించారు. 'ఎవరినీ లోపలికి అనుమతించ వద్దంటూ పైనుంచి ఆదేశాలు వచ్చాయని పోలీసులు చెప్పారు. ఈ పోలీసు చర్య భాజపాకు సంతోషాన్ని కలిగిస్తుంది' అని సౌరభ్ విమర్శించారు. తర్వాత సింగ్‌తో పాటు కొద్దిసేపు ధర్నాకు కూర్చొని.. ప్రధాని అధికారిక నివాసం ఉన్న లోక్‌కల్యాణ్ మార్గ్ వైపు వెళ్లారు. పీఎం నివాసం సమీపంలోనే పోలీసులు వారిని అడ్డుకున్నారు. మరోవైపు ఆప్‌నకు కౌంటర్‌గా భాజపా దిల్లీ సీఎం అధికారిక నివాసం వద్దకు వెళ్లినట్లు తెలుస్తోంది. దిల్లీలోని 6 ఫ్లాగ్ స్టాఫ్ రోడ్‌లో ఉన్న ప్రభుత్వ బంగ్లాను



అరవింద్ కేజ్రీవాల్ సీఎంగా ఉన్న సమయంలో అధికారిక నివాసంగా వినియోగించారు. ఈ బంగ్లాను 'శీష్ మహల్' గా భాజపా అభివర్ణిస్తోంది. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి ఆయన 7-స్టార్ రిసార్ట్‌గా మార్చుకున్నారని విమర్శించింది. దీనికి కౌంటర్‌గా పీఎం నివాసాన్ని 'రాజ్ మహల్' అంటూ విమర్శలు చేస్తోంది.

# తిరుమలలో పూర్తికావచ్చిన వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు

## పదిరోజులపాటు భక్తులకు ఉత్తర ద్వార దర్శనం

## మహాకుంభమేళాలలో తిరుమల నమూనా ఆలయం

**తిరుమల,జనవరి8(తెలంగాణ వీణ):**

తిరుమలలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు పూర్తి కావచ్చాయి. ఇలవైకుంఠం తిరుమలలో ఏటా వైకుంఠ ఏకాదశికి భారీగా భక్తులు తరలివస్తారు. ఈనెల 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా 10 రోజులపాటు వైకుంఠ ద్వారాలు తెరిచి ఉంచుతామని, అందుకు తగిన భద్రతా చర్యలు చేపట్టామని టిటిడి ఈఓ శ్యామలా రావు ప్రకటించారు. మహాకుంభమేళలో టిటిడి ప్రత్యేక ఏర్పాట్లు చేసిందన్నారు. జనవరి 13 నుండి ఫిబ్రవరి 26 వరకు జరగనుందని తెలిపారు. 2.89 ఎకరాల భూమి కుంభమేళా లో కేటాయించారని, అక్కడ నమూనా ఆలయాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. శ్రీవారి ఆలయంలో జరిగే అన్నీ సేవలు, కైంకర్యాలు నమూనా ఆలయంలో నిర్వహిస్తామన్నారు. జనవరి 18, 26.. ఫిబ్రవరి 3, 26 తేదిలలో కళ్యాణోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. తిరుమల నుండి కుంభమేళాకి కళ్యాణ రథం ప్రారంభించారు. ఇకపోతే వైకుంఠ ద్వార దర్శన టికెట్లు ఉన్న వారికే పది రోజుల పాటు దర్శనం, టికెట్లు లేకుంటే దర్శనం లేదు అని స్పష్టం చేశారు. పది రోజుల్లో 7 లక్షలమంది దర్శనం చేసుకునేలా ఏర్పాటు చేశామన్నారు. జనవరి 9 న సర్వదర్శన టికెట్లు జారీ నిలిపివేస్తున్నామని తెలిపారు. సిఫార్సు లేఖలు రద్దు చేశామన్నారు. వసతి ఎవరు ముందు వస్తే వారికే కేటాయిస్తామని చెప్పారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశామన్నారు. జనవరి 10న ఉదయం 4:30 గంటలకు విఐపీ దర్శనం ఉందన్నారు. 8:30 గంటలకు సామాన్య భక్తులు దర్శనం ఉంటుందన్నారు. ఏకాదశి నాడు స్వర్ణ రథం ఊరేగింపు ఉంటుందన్నారు. 12 గంటలకు వాహన మండపంలో భక్తులు కోసం ఉత్సవమూర్తు లుంటారని తెలిపారు. ద్వాదశి నాడు శ్రీవారి పుష్కరిణి లో చక్రస్నానం ఉంటుందన్నారు. 9వ తేది ఉదయం 5 గంటలకు తిరుమల తిరుపతి లో 94 కౌంటర్ లో టోకెన్ లు కేటాయిస్తున్నామన్నారు. 10, 11, 12 తేదిలకు 9 తేది కేటాయింపులున్నాయన్నారు. తక్కిన రోజుల్లో ఏరోజుకారోజు మూడు ప్రదేశాలలో టోకెన్ కేటాయిస్తామన్నారు. ఇప్పటికే ఆన్ లైన్ వైకుంఠ ద్వార దర్శన టికెట్లు కేటాయించామన్నారు. ప్రత్యేక దర్శనాలు రద్దు చేశామన్నారు. 12 వేల వాహనాలకు వాహన పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశామని తెలిపారు. విఐపీలకు రాంభకిఛ వద్దే వాహనాలు అనుమతిస్తామన్నారు. భద్రత పై ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. టోకెన్ ఇచ్చే కేంద్రాల వద్ద విజిలెన్స్, పోలీసుల సహాయంతో ఏర్పాట్లు చేశామన్నారు. అన్న ప్రసాద కేంద్రం ఉదయం ఆరు గంటల నుండి 12 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఆలయంలో అలంకరణ ప్రత్యేక నిపుణులతో చేయిస్తున్నామన్నారు. మూడువేల శ్రీవారి సేవకుల సేవలు వాడుకుంటామని తెలిపారు. పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. వైకుంఠ ఏకాదశికి విఐపీల తాకిడి అధికంగా ఉన్న సందర్భంగా ప్రత్యేక భద్రత ఏర్పాటు చేస్తామన్నారు. సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా భద్రత కల్పిస్తామన్నారు. పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశామని తెలిపారు. భక్తులకు టికెట్ పైనే రూట్ మ్యాప్ ఏర్పాటు చేశామన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా తిరుమలలో రూట్ మ్యాప్ తెలుసుకోవచ్చునని చెప్పారు. మూడు వేలమందితో వైకుంఠ ఏకాదశి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

# అల్లు అర్జున్ విడుదలలో ఎలాంటి తప్పిదం లేదు

## జైళ్ల వార్షిక నివేదిక విడుదలలో డిజి సౌమ్యా మిశ్రా

**హైదరాబాద్,జనవరి8(తెలంగాణ వీణ):**

ఇటీవల పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా జరిగిన సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన ఎంత దుమారం రేపిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ ఘటనలో హీరో అల్లు అర్జున్ అరెస్టయిన సంగతి కూడా తెలిసిందే. అయితే.. నాటకీయ పరిణామాల మధ్య అల్లు అర్జున్ అరెస్ట్ అవ్వడంపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఇదిలా ఉండగా, అల్లు అర్జున్ విడుదల సమయంలో వెనుక గేట్ నుండి పంపడంపై కూడా పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ అంశంపై క్లారిటీ ఇచ్చారు జైల్ డీజీ సౌమ్య మిశ్రా. అల్లు అర్జున్ ను జైలు వెనుక గేటు నుండి పంపడంలో తమ నుండి ఎలాంటి తప్పు లేదని స్పష్టం చేశారు సౌమ్య మిశ్రా. జైళ్ల వార్షిక నివేదిక విడుదల సందర్భంగా మాట్లాడుతూ.. ఈ మేరకు సౌమ్య వ్యాఖ్యలు చేశారు. చివరిసారిగా 2019 లో వార్షిక సమావేశం ఏర్పాటు చేశామని.. 2024 లో జైల్ అదాలత్ లో 1045 లో అవకాశం కల్పించామని అన్నారు సౌమ్య. 2650 మంది ఖైదీలు స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో ట్రైనింగ్ తీసుకుంటున్నారని.. సత్ప్రవర్తన కలిగిన 213 మంది ఖైదీలను విడుదల చేసినట్లు తెలిపారు.2024 లో 8 మంది ఖైదీలకు బ్యాంక్ లోన్స్ ఇచ్చామని.. జైల్లో ఉండి 750 మంది డిగ్రీ పూర్తి చేశారని, 225 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ పట్ట పొందారని అన్నారు. జైల్లో ఉన్న ఖైదీల ద్వారా ఇంటికి అవసరమైన పరికరాలను ఖైదీలతో తయారు చేయించామని.. ఖైదీల నుండి టైలరింగ్,ప్రింటింగ్ ప్రెస్ బేకరి యూనిటి,పౌల్ట్రీ వంటి పరిశ్రమలు ఏర్పాటు చేశామని అన్నారు. జైల్లో ఉన్న ఖైదీలకు ఉపాధి కల్పనకు అవసరమైన జాతీయ చమురు కంపెనీలతో 29 అవుట్ లే అవుట్ లెట్ల ను ఏర్పాటు చేశామని అన్నారు సౌమ్య.నుమయిష్ ఎగ్జిబిషన్ లో మా స్టాల్ ఏర్పాటు చేశామని.. గతంలో నుమయిష్ ఎగ్జిబిషన్ లో ఏర్పాటు చేసిన స్టాల్ కి తెలంగాణ ప్రభుత్వం అవార్డు ఇచ్చిందని తెలిపారు సౌమ్య. జైళ్లను ఎ÷-లాస్టిక్ రహితంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని.త్వరలోనే రాష్ట్రంలో ఉన్న జైళ్లను మరమ్మత్తులు చేయడానికి ప్రభుత్వం సన్నద్ధం అవుతుందని సౌమ్య తెలిపారు.

# బ్యాంకు సిబ్బంది వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

**కుమ్రంభీం ఆసిఫాబాద్, జనవరి 8 (తెలంగాణ వీణ):**

తీసుకున్న రుణం చెల్లించలేదని బ్యాంకు సిబ్బంది బెదరింరించడంతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాదకర సంఘటన కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలం శివపూర్ గ్రామంలో చోటు చేసకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కారం సంతోష్(35) అనే వ్యక్తి జిల్లా కొ-ఆపరేటిట్ సొసైటీ బ్యాంకులో లోన్ తీసుకున్నాడు. అయితే డబ్బుల కట్టలేదని బ్యాంకు సిబ్బంది డబ్బులు కట్టాలని బెదిరింపులకు గురిచేశారు. దీంతో మనస్తాపం చెందిన సంతోష్ పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బాధితుడి కుటుంబ సబ్యులు బ్యాంకు సిబ్బంది పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. సంతోష్ మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

# అమెరికాలో మరోమారు కార్చిచ్చు

## లాస్ ఏంజిల్స్‌లో వేల ఎకరాలు దగ్ధం- సురక్షిత ప్రాంతాలకు 30వేలమంది తరలింపు

**న్యూయార్క్,జనవరి8(తెలంగాణ వీణ):**

అమెరికాలో కుబేరులకు ఆవాసాలైన మూడు నగరాల్లో లాస్ ఏంజెలెస్ ఒకటి. ఇప్పుడు ఆ సిటీలోని అత్యంత ఖరీదైన ప్రదేశాన్ని కార్చిచ్చు చుట్టుముట్టింది. దీంతో వేలాది ఎకరాల్లోని విలాసవంతమైన ఇళ్లు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. ఇక్కడ సంపన్నవర్గాలు నివసించే ది పాలిసాడ్స్ ప్రాంతంలో కార్చిచ్చు చెలరేగింది. దాదాపు 3000 ఎకరాలు దగ్ధమయ్యాయి. దీంతో 30,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. చాలామంది తమ సామగ్రి, వాహనాలను అక్కడే వదిలేసి ప్రాణాలు కాపాడుకోవడానికి తరలివెళ్లారు. వీధుల్లో పొగ కమ్మేసింది. మరోవైపు ఒక్కసారిగా ప్రజలు రోడ్ల పైకి రావడంతో చాలాచోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇక్కడ కొండలపై ఉన్న రహదారులు ఇరుగ్గా ఉంటాయి. దీనికితోడు గాలులు ఎక్కువగా వీయడంతో మంటలు తొందరగా వ్యాపిస్తున్నాయి. రాత్రి వేళల్లో ఇక్కడ గంటకు 100 మైళ్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ స్పందిస్తూ.. 'చాలా నిర్మాణాలు కాలిపోయాయి. మరికొన్నిచోట్ల కూడా కార్చిచ్చులు పుట్టొచ్చని అగ్నిమాపక శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు' అని తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 13,000 నిర్మాణాలకు కార్చిచ్చు ముప్పున్నట్లు లాస్ ఏంజెలెస్ అగ్నిమాక అధికారి క్రిస్టిన్ క్రాప్లీ చెప్పారు. బెవర్లీ హిల్స్, హాలీవుడ్ హిల్స్, మలిబు, శాన్‌ఫెర్నాండో ప్రాంతాలకు కార్చిచ్చు వ్యాపించే ప్రమాదం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఇప్పటికే ఇక్కడి ÷ర్ అలర్ట్ లెవల్స్‌ను పెంచారు. దాదాపు 62,000 మంది ప్రజలు కొన్ని గంటలుగా విద్యుత్తు లేక ఇబ్బందిపడుతున్నారు. ఇక్కడ మంటలను ఆర్పడానికి విమానాలు, హెలికాప్టర్లు, బుల్డోజర్లను అధికారులు రప్పించారు. హాలీవుడ్ స్టార్లు టామ్ హాంక్స్, రీస్ విథర్స్పూన్, స్పెన్సర్ ప్రాట్, హెడీ మోంటాగ్ వంటి నటుల ఇళ్లు అగ్నికి ఆహుతైనట్లు తెలుస్తోంది. మరికొందరి ఇళ్లు కూడా అగ్నికీలలకు సమీపంలో ఉన్నట్లు తెలుస్తోంది. అధ్యక్షుడు జోబైడెన్ ఇక్కడి కార్చిచ్చుపై స్పందించారు. తరచూ అప్‌డేట్లు తెలుసుకొంటున్నట్లు వెల్లడించారు. అక్కడి ప్రజలకు అవసరమైన అన్నిరకాల సాయాలను శ్వేతసౌధం చేస్తుందన్నారు. స్థానిక అధికారులతో తన బృందం టచ్‌లో ఉన్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ÷ర్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ గ్రాంట్‌ను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అక్కడి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. స్థానిక అధికారుల సూచనలు పాటించాలని కోరారు.

# రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాల వద్ద హెచ్‌ఎంపీవీపై స్క్రీనింగ్ టెస్టులు

**న్యూఢిల్లీ, జనవరి 8 (తెలంగాణ వీణ):**

దేశంలో హెచ్‌ఎంపీవీ కేసులు పెరుగుతున్నాయి. ఇప్పటి వరకు వైరస్ ఏడుగురికి పాజిటివ్‌గా తేలింది. కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాల వద్ద పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేసింది. దేశంలో హెచ్‌ఎంపీవీ ఇన్ఫెక్షన్ పెరుగుదల నేపథ్యంలో సివిల్ సర్జన్లందరికీ ఒక సలహా జారీ చేసినట్లు హర్యానా ఆరోగ్య మంత్రి ఆర్తీ సింగ్‌రావు తెలిపారు. హర్యానాలో ఇప్పటివరకు ఒక్క హెచ్‌ఎంపీవీ కేసు రికార్డవలేదని.. అయితే, ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. హెచ్‌ఎంపీవీ ముప్పు నేపథ్యంలో ప్రభుత్వాలు నిఘాను పెంచాయి. రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలతో పాటు రద్దీగా ఉండే ప్రాంతాల్లో స్క్రీన్ చేస్తున్నారు. దగ్గు, జలుబుతో ఆసుపత్రులకు వచ్చే రోగులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. వాటిని స్క్రీన్ చేయడంతో పాటు పలు రాష్ట్రాల్లో రోగులను ఉంచేందుకు ఐసోలేషన్ వార్డులను సైతం సిద్ధం చేస్తున్నారు. హ్యూమన్ మెటాప్ న్యూమో వైరస్ శ్వాసకోశ వ్యవస్థలో సమస్యలను కలిగిస్తుంది. రోగనిరోధక వ్యవస్థ బలంగా లేని వ్యక్తులకు ప్రమాదకరం. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తుల్లో ఎక్కువగా వ్యాప్తి చెందేందుకు అవకాశం ఉంది.

# ప్రముఖ నటిపై లైంగిక వేధింపుల కేసులో వ్యాపారి అరెస్టు

**తిరువనంతపురం, జనవరి 8 (తెలంగాణ వీణ):**

సినిమా నటి హనీ రోజ్‌ని లైంగికంగా వేధించిన కేసులో కేరళకు చెందిన ప్రముఖ నగల వ్యాపారి బాబీ చెమ్మనూం అరెస్టయ్యారు. నటి ఫిర్యాదు అనంతరం కేరళ సర్కారు ఏర్పాటు చేసిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ బుధవారం మధ్యాహ్నం బాబీ చెమ్మనూర్‌ను కస్టడీలోకి తీసుకుంది. హనీరోజ్ ఫిర్యాదు మేరకు కేరళ పోలీసులు ఆయనపై నాన్ బెయిలబుల్ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. ఇవాళ వాయనాడ్‌లో ఆయనను అరెస్ట్ చేశారు. వ్యాపారి చెమ్మనూర్ అరెస్టుపై నటి హనీరోజ్ స్పందించారు. ఇది తనకు ఎంతో ప్రశాంతమైన రోజని అన్నారు. తాను ఈ విషయాన్ని సీఎం పినరయి విజయన్ దృష్టికి తీసుకెళ్లగానే వ్యాపారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. 2012లో వచ్చిన త్రివేండ్రమ్ లాడ్జి సినిమాతో మంచి గుర్తింపు సంపాదించిన హనీరోజ్.. ఇలాంటి మతిలేని మనుషుల గురించి తాను పెద్దగా పట్టించుకోనని, అయితే చెమ్మనూర్ మళ్లీమళ్లీ లైంగికంగా వేధించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశానని చెప్పారు. నాలుగు నెలల క్రితం ఆయన తనపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తెలిపారు. దాంతో తన కుటుంబం అంతా ఆవేదన చెందినదని చెప్పారు.

# లైంగిక దాడిపై స్టాలిన్ వ్యాఖ్యలు దురదుష్టకరం : పొంగులేటి సుధాకర్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 8 (తెలంగాణ వీణ):**



అన్నా యూనివర్సిటీలో లైంగిక దాడి ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అసెంబ్లీ వేదికగా చేసిన వ్యాఖ్యలను అక్కడి బీజేపీ తప్పుపట్టింది. అసెంబ్లీలో సీఎం స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని తమిళనాడు బీజేపీ సహ ఇన్‌చార్జి సుధాకర్ రెడ్డి వ్యాఖ్యానించారు. నిందితుడు డీఎంకే సభ్యుడు కాదని, కేవలం డీఎంకే సానుభూతిపరుడు మాత్రమేనని సీఎం స్టాలిన్ చెప్పడం దారుణమని అన్నారు. అన్నా యూనివర్సిటీలో విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు డీఎంకే సభ్యుడు కాదని, కేవలం డీఎంకే సానుభూతిపరుడు మాత్రమేనని సీఎం ఎలా చెప్పగలిగారని సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. నిందితుడు డీఎంకే సానుభూతిపరుడు కాబట్టే తాము ఘటనపై సీబీఐ దర్యాప్తు కోసం డిమాండ్ చేస్తున్నామని ఆయన చెప్పారు. ఘటనపై సీబీఐతో దర్యాప్తు చేయిస్తే అంతా సవ్యంగా ఉంటుందని అన్నారు. అన్నా యూనివర్సిటీ ఘటనపై ముఖ్యమంత్రి స్టాలిన్ నైతిక బాధ్యతతో స్పందిస్తారని తాము ఆశించామని, కానీ ఆయన స్పందన అందుకు విరుద్ధంగా ఉన్నదని సుధాకర్‌రెడ్డి విమర్శించారు. అన్నా వర్సిటీ అంశంపై సరిగా స్పందించకపోగా గవర్నర్‌పై విమర్శలకు దిగి.. అసలు విషయాన్ని మరుగున పడేసే ప్రయత్నం చేశారని ఆరోపించారు. తాము లైంగిక దాడిపై సీబీఐ దర్యాప్తునకు డిమాండ్ చేస్తున్నామని, లేదంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని అన్నారు.

# ఢిల్లీలోని సీఎం బంగ్లా వద్ద హైడ్రామా

## ఆప్ నేతలను అడ్డుకున్న పోలీసులు

**న్యూఢిల్లీ, జనవరి 8 (తెలంగాణ వీణ):**

దేశ రాజధాని ఢిల్లీలోని సీఎం బంగ్లా వద్ద హైడ్రామా నెలకొన్నది. అరవింద్ కేజ్రీవాల్ సీఎంగా ఉన్నప్పుడు షీష్ మహల్ ఆధునీకరణంలో భాగంగా టాయిలెట్‌లో గోల్డెన్ కమోడ్, స్విమ్మింగ్ పూల్, మినీ బార్ వంటివి ఏర్పాటు చేసుకున్నారని బీజేపీ ఆరోపించింది. ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆప్ దీనిని ఖండించింది. ఈ నేపథ్యంలో బుధవారం రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్, ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ మీడియాతో కలిసి ఆ బంగ్లా వద్దకు వెళ్లారు. బీజేపీ ఆరోపణలు తప్పని నిరూపించేందుకు, 6 ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లోని బంగ్లాలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. అయితే అక్కడ భారీగా మోహరించిన పోలీసులు ఆప్ నేతలను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో వారు అక్కడ బైఠాయించి నిరసన తెలిపారు. కాగా, ఈ సందర్భంగా ఆప్ నేతలు సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్ బీజేపీపై మండిపడ్డారు. ఆ పార్టీ అబద్ధాలు బయటపడ్డాయని అన్నారు. 'సీఎం నివాసంలో బంగారు మరుగుదొడ్డి, స్విమ్మింగ్ పూల్, మినీ బార్ ఉన్నాయంటూ బీజేపీ నేతలు కొన్ని నెలలుగా గోల చేస్తున్నారు. ఇవాళ మీడియాతో పాటు ఇక్కడకు వచ్చాం. బీజేపీ నేతలు కూడా రావాలని కోరాం. వారు చెప్పిన బంగారు మరుగుదొడ్లు, స్విమ్మింగ్ పూల్ ఎక్కడ ఉన్నాయో చూడాలనుకున్నాం. అయితే పోలీసులు, వాటర్ ఫిరంగులను మోహరించారు. లోనికి అనుమతిస్తే అసలు నిజం బయటపడేది' అని అన్నారు. మరోవైపు ప్రధాని మోదీ అధికార నివాసం 'రాజ్ మహల్' అని ఆప్ నేతలు విమర్శించారు. దీని కోసం రూ.2,700 కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. దమ్ముంటే ప్రజా ధనంతో నిర్మించిన ప్రధాని లగ్జరీ హౌస్‌లోకి మీడియాను అనుమతించాలని బీజేపీకి సవాల్ చేశారు. ఆప్ నేతలు సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్ ఆ తర్వాత ప్రధాని నివాసం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.



# స్పేస్ నిర్మాణానికి ప్రధాని గ్రీన్ సిగ్నల్ : ఇస్రో కొత్త చీఫ్

**తిరువనంతపురం, జనవరి 8 (తెలంగాణ వీణ):**

ప్రముఖ రాకెట్ శాస్త్రవేత్త వీ నారాయణన్‌ను ఇస్రో చీఫ్‌గా నియమించిన విషయం తెలిసిందే. ఇస్రో చాలా విజయవంతమైన దశలో ఉన్నదని, చంద్రయాన్-4తో పాటు గగన్‌యాన్ మిషన్లు తమ ముందు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇస్రో చైర్మెన్‌తో పాటు అంతరిక్ష శాఖ కార్యదర్శిగా నియమితుడైన సందర్భంగా వీ నారాయణన్ సంతోషం వ్యక్తం చేశారు. ఎంతో మంది గొప్ప శాస్త్రవేత్తల నాయకత్వంలో సంస్థ కీర్తిగాంచిందని, అలాంటి సంస్థలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇస్రో చాలా గొప్ప సంస్థ అని, గతంలో అనేక మంది గొప్ప నేతలు దీన్ని నడిపించారని, ఈ సంస్థలో భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఓ ప్రశ్నకు బదులిస్తూ.. తన నియామకం గురించి తొలుత ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ఫోన్ వచ్చినట్లు వీ నారాయణన్ చెప్పారు. ప్రధానియే అన్నీ డిసైడ్ చేస్తున్నారని, పీఎంవో తనను కాంటాక్ట్ అయ్యిందని, ప్రస్తుతం ఇస్రో చైర్మెన్ ఎస్ సోమనాథ్ కూడా తనకు ఫోన్ కాల్ చేశారని, కొత్త అపాయింట్మెంట్ గురించి చెప్పినట్లు ఆయన వెల్లడించారు. త్వరలో చేపట్టబోయే ఇస్రో ప్రాజెక్టుల గురించి మాట్లాడుతూ.. ఇస్రో చాలా కీలకమైన మిషన్లను చేపడుతున్నదని, ప్రస్తుతం ఇస్రో విజయవంతమైన దశలో వెళ్తోందన్నారు. చేపట్టబోయే ప్రాజెక్టుల గురించి వివరిస్తూ.. స్పేడెక్స్ మిషన్‌ను డిసెంబర్ 30వ తేదీన చేపట్టామని, జనవరి 9వ తేదీన స్పేడెక్స్ శాటిలైట్ల డాకింగ్ జరగనున్నట్లు ఆయన తెలిపారు. గగన్‌యాన్ కూడా ఇస్రో ముందున్న అతిపెద్ద ప్రోగ్రామ్ అని పేర్కొన్నారు. క్రూ లేకుండా మాడ్యూల్‌ను ప్రయోగించే దాని కోసం ఇస్రోలో పనులు జరుగుతున్నాయన్నారు. జీఎస్ఎల్వీ ద్వారా ఎన్వీఎస్ 02 నావిగేషన్ శాటిలైట్ను పంపేందుకు శ్రీహరికోటలో వర్క్ జరుగుతోందన్నారు. ఇస్రో మాక్ 3 వెహికిల్ ద్వారా అమెరికాకు చెందిన కమర్షియల్ శాటిలైట్‌ను కూడా ప్రయోగించనున్నారు. గగన్‌యాన్ రాకెట్ అసెంబ్లింగ్‌కు చెందిన పనులు



కూడా శ్రీహరికోట్లో ప్రోగ్రెస్ అవుతున్నాయి. చంద్రయాన్3 ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండ్ అయిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. చంద్రయాన్ 4 ద్వారా ఆ ప్రదేశంలో చంద్రుడిపై ల్యాండ్ అయి, శ్యాంపిల్లు సేకరించిన తర్వాత మళ్లీ తిరిగి వచ్చే రీతిలో పనులు జరుగుతున్నాయన్నారు. భారత స్పేస్ స్టేషన్‌ని సెటప్ చేసేందుకు ప్లాన్ జరుగుతోందన్నారు. స్పేస్ స్టేషన్ నిర్మాణం కోసం ప్రధాని మోదీ అనుమతి కూడా తమకు దక్కిందన్నారు. స్పేస్ స్టేషన్‌కు అయిదు మాడ్యూళ్లు ఉంటాయని, 2028లో స్పేస్ స్టేషన్‌కు తొలి మాడ్యూల్‌ను లాంచ్ చేసే రీతిలో అనుమతి దక్కిందన్నారు.

# అస్సాం బొగ్గుగనిలో చిక్కుకున్న 15 మంది కార్మికులు

## గని నుంచి ఒకరి మృతదేహం వెలికితీత

**న్యూఢిల్లీ, జనవరి 8 (తెలంగాణ వీణ):**

అస్సాంలోని డిమా హసావోలోని బొగ్గు గని నుంచి ఓ మృతదేహాన్ని వెలికి తీశారు. రెండు రోజుల క్రితం ఆ గనిలోకి నీరు ప్రవేశించింది. దీంతో దాంట్లో సుమారు 15 మంది కార్మికులు చిక్కుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. నీటితో నిండిన గనిలోకి 21 పారా డైవర్లు గాలింపు కోసం వెళ్లారు. గని దిగువ భాగం నుంచి ఓ మృతదేహాన్ని తీసుకువచ్చారు. నేవీ, ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ దళాలు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి. విశాఖపట్టణంకు చెందిన డైవర్లు అక్కడకు చేరుకున్నారు. ఆపరేషన్‌కు ముందు రెక్కీ నిర్వహించి ఆ తర్వాత క్వారీలోకి ఎంటరయ్యారు. గని నుంచి నీటిని తొవ్వేందుకు ఎస్డీఆర్ఎఫ్ డీవాటర్ పంపులను తీసుకువస్తోంది. కుంభీగ్రామ్ నుంచి కూడా ఎంఐ17 హెలికాప్టర్ ద్వారా ఓఎన్జీసీ వాటర్ పైపులను తీసుకువస్తున్నారు. కేంద్ర గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డితో మాట్లాడినట్లు సీఎం హిమంత బిశ్వ శర్మ తెలిపారు. కోల్ ఇండియాకు చెందిన సిబ్బంది.. రెస్క్యూ ఆపరేషన్‌కు రానున్నట్లు మంత్రి తెలిపారు. క్వారీలో నీరు వంద ఫీట్లకు చేరుకున్నది. సుమారు 340 ఫీట్ల లోతులో ఉన్న క్వారీలో కార్మికులు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. కార్మికుల పేర్లను కూడా రిలీజ్ చేశారు.అక్రమ రీతిలో గని నిర్వహిస్తున్నట్లు గుర్తించామని సీఎం హిమంత బిశ్వ శర్మ తెలిపారు. ఈ కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు చెప్పారు. ఉమ్రాంగ్సో పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎన్డీఆర్ఎఫ్ ఫస్ట్ బెటాలియన్ కమాండెంట్ హెచ్పీఎస్ ఖాన్‌దారి మాట్లాడుతూ.. నిన్న చాలాసార్లు కార్మికులను చేరుకునేందుకు ప్రయత్నించామని, కానీ తమ ప్రయత్నాలు ఫలించలేదన్నారు. జాయింట్ టీమ్ ఇవాళ గనిలోకి డైవ్‌చేసిందని, వాళ్లు ఓ బాడీని రికవరీ చేసినట్లు చెప్పారు.



గనుల్లో డైవింగ్ చేయడం సులువైన అంశం కాదని, రాట్ హోల్స్ ఉన్నాయని, వాటి ఆధారంగా గాలింపు ఉంటుందని ఆయన తెలిపారు..

# కింగ్‌ఫిషర్ బీర్ ప్రియులకు చేదువార్త

**హైదరాబాద్, జనవరి 8 (తెలంగాణ వీణ):**

ఇది బీర్ ప్రియులకు పెద్ద షాక్.. ముఖ్యంగా కింగ్ ఫిసర్ బీర్‌ప్రేమికులకు మింగుడు పడదు. తెలంగాణకు కింగ్ ఫిషర్ల బీర్ల సరఫరా నిలిపివేస్తున్నట్లు యునైటెడ్ బ్రూవరీస్ కంపెనీ స్పష్టం చేసింది. తెలంగాణ స్టేట్ బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ బకాయిలు చెల్లించకపోవడంతో.. ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూబీఎల్ ప్రకటించింది. తెలంగాణ ప్రభుత్వం బీర్ల ధరలను పెంచింది కానీ.. తయారీదారులకు చెల్లించే బేస్ ధరను పెంచకపోవడంతో భారీ నష్టాలు వస్తున్నాయని యూబీఎల్ తెలిపింది. బీర్ల సరఫరా నిలిపివేతకు ఇది కూడా ఒక కారణమని కంపెనీ పేర్కొంది. తెలంగాణ నుంచి రూ. 900 కోట్లు రావాల్సి ఉందని పేర్కొంది. ఈ జాప్యం కూడా కంపెనీ నష్టాలకు కారణమైందని తెలిపింది. ఈ విషయాన్ని సెబీకి లేఖ ద్వారా తెలిపింది. కింగ్ ఫిషర్, కింగ్ ఫిషర్ స్ట్రాంగ్, కింగ్ ఫిషర్ అల్ట్రా, కింగ్ ఫిషర్ అల్ట్రా మ్యాక్స్‌తో పాటు ఇతర బ్రాండ్లను నిలిపివేస్తున్నట్లు యూబీఎల్ స్పష్టం చేసింది. నిజానికి తెలంగాణ రాష్ట్రంలో బీర్ల అమ్మకాలను పరిశీలిస్తే కింగ్ ఫిషర్ బ్రాండ్స్ 60 నుంచి 70 శాతం అధికంగా విక్రయం అవుతున్నట్లు తెలిపింది.

# కుంభమేళాకు శ్రీవారి కళ్యాణరథం

## జెండా ఊపి ప్రారంభించిన చైర్మన్

**తిరుమల,జనవరి8(తెలంగాణ వీణ):**

తిరుమల శ్రీవారి ఆలయం వద్ద నుంచి ప్రయాగ్ రాజ్ కుంభమేళాకు శ్రీవారి కళ్యాణరథం బయలుదేరింది. కల్యాణ రథంకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు , అదనపు ఈవో వెంకయ్య చౌదరి జెండా ఊపి ప్రయాగ్‌రాజ్‌కు కళ్యాణరథాన్ని పంపారు. ఈ సందర్భంగా అదనపు ఈవో వెంకయ్య చౌదరి మాట్లాడుతూ మహా కుంభ మేళా నేపథ్యంలో యూపీలోని ప్రయాగ్ రాజ్‌లో 2.5 ఎకరాల్లో



శ్రీవారి నమూన ఆలయాన్ని ఏర్పాటు చేశామని, ఈ నెల 13వ తేదీ నుండి ఫిబ్రవరి 26వ తేదీ వరకు భక్తులకు స్వామి వారీ దర్శనం కల్పిస్తామని అన్నారు. నమూనా ఆలయంలో స్వామి వారికీ నిత్య కైంకర్యాలు నిర్వహిస్తామని, జనవరి 18, 26, ఫిబ్రవరి 3,12వ తేదీల్లో శ్రీవారికీ ప్రత్యేక కళ్యాణోత్సవ సేవను నిర్వహిస్తామన్నారు. డిప్యుటేషన్‌పై 150 మంది సిబ్బందిని ప్రయాగ్‌లో నియమించామని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్వామి వారి దర్శనం కల్పిస్తామని ఈవో వెంకయ్య చౌదరి వెల్లడించారు.

GS9 TV తెలుగు
తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

అతి కొద్ది కాలంలోనే ప్రజలకు ప్రజాప్రతినిధులకూ వారధి గా ప్రదర్శింపబడుతున్న
GS9TV కేబుల్ ఛానల్, తెలంగాణ వీణ తెలుగు దినపత్రికకు
అన్ని జిల్లాల నుండి విలేకరులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు
8328209811
9703024024

# గ్రూప్-3 ప్రిలిమనరీ కీ విడుదల

## 12 వరకు అభ్యంతరాల స్వీకరణ

## మే 1 నుంచి కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు

## టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం వెల్లడి

**హైదరాబాద్,జనవరి8(తెలంగాణ వీణ):**

రాష్ట్రంలో 1,365 ఉద్యోగ ఖాళీలకు నిర్వహించిన గ్రూప్ -3 పరీక్ష ప్రిలిమినరీ కీని టీజీపీఎస్సీ విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 1,401 కేంద్రాల్లో గతేడాది నవంబర్ 17, 18 తేదీల్లో ఈ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. మొత్తం మూడు పేపర్లుగా నిర్వహించిన ఈ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 5.36లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. 2,69,483 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. గ్రూప్ 3 ప్రిలిమినరీ కీపై జనవరి 12 సాయంత్రం 5గంటల వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఇంగ్లిష్‌లోనే అభ్యంతరాలను తెలపాలని, అభ్యర్థులు లేవనెత్తిన అంశాలకు సంబంధించిన ఆధారాల కాపీలను ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేయాలని సూచించారు. ఈ-మెయిల్, వ్యక్తిగతంగా వెళ్లి సమర్పించడాన్ని ఎట్టిపరిస్థితుల్లో అనుమతించబోమని స్పష్టంచేశారు. ఇదిలావుంటే మే 1 నుంచి కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేస్తామని టీజీపీఎస్సీ వెల్లడించింది. మార్చి 31లోగా ఉద్యోగ ఖాళీల వివరాలను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు పేర్కొంది. ఖాళీల ప్రకారం నోటిఫికేషన్ల జారీపై ఏప్రిల్‌లో కసరత్తు చేస్తామని తెలిపింది. కొత్త నోటిఫికేషన్లు ఇచ్చి 6-8 నెలల్లో భర్తీ పక్రియను పూర్తి చేస్తామని కమిషన్ ప్రకటించింది. గురువారం గ్రూప్-3 'కీ' విడుదల చేయనుంది. రెండ్రోజుల్లో గ్రూప్-2 'కీ' విడుదల చేయనున్నట్టు టీజీపీఎస్సీ తెలిపింది. షెడ్యూల్ ప్రకారం ఫలితాలు వచ్చేలా పనిచేస్తున్నామని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. ఈనెల 11, 12 తేదీల్లో బెంగళూరులో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల సదస్సు ఉంటుందని, ఉద్యోగ పరీక్షల విధానాలపై సదస్సులో చర్చించనున్నట్టు చెప్పారు.

# ఫార్ములా ఈ కార్ రేసు కేసు ఏసీబీ దూకుడు

## నిధుల విడుదలపై అరవింద్ కుమార్‌కు ప్రశ్నలు-ఇడి విచారణలో హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎన్ఎల్ రెడ్డి

**హైదరాబాద్,జనవరి8(తెలంగాణ వీణ):**

ఫార్ములా ఈ కార్ రేసు కేసు దర్యాప్తులో ఏసీబీ దూకుడు పెంచింది. ఈ కేసులో నోటీసులు అందుకున్న అప్పటి పురపాలకశాఖ ప్రత్యేక కార్యదర్శి అరవింద్ కుమార్ బుధవాం ఉదయం ఏసీబీ విచారణకు వచ్చారు. దాదాపు మూడు గంటలుగా అరవింద్ కుమార్‌ను ఏసీబీ ప్రశ్నించింది. ముగ్గురు ఏసీబీ అధికారుల బృందం.. ఫార్ములా ఈ కార్ రేసులో నిధుల మళ్లింపుకు సంబంధించే ఏసీబీ ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు తెలుస్తోంది. రూ.55 కోట్ల నిధులను విదేశీ కంపెనీకి హెచ్ఎండీఏ చెల్లించిన నేపథ్యంలో ఇదే విషయంపై ఏసీబీ అధికారులు ప్రశ్నించారని సమాచారం. రూ.55 కోట్లు ఎఫ్ఈవో సంస్థకు చెల్లించిన నేపథ్యంలో విదేశీ కంపెనీకి నగదు బదిలీ వెనుక ఉన్న అసలు కోణం ఏంటి.. ఇది ఎవరి నిర్ణయం... నగదు బదిలీకి ఆర్బీఐ అనుమతి ఉందా అంటూ అరవింద్ కుమార్‌కు ఏసీబీ వరుస ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. అలాగే ఈ ప్రశ్నలకు అరవింద్ కుమార్ కూడా కీలక సమాచారం చెప్పినట్లు సమాచారం. కేటీఆర్ ఆదేశాలు ఇవ్వడంతోనే నగదు రిలీజ్ చేశామని అరవింద్ కుమార్ స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అరవింద్ కుమార్ చెబుతున్న స్టేట్‌మెంట్‌ను ఏసీబీ రికార్డు చేస్తోంది. 55కోట్లు నిధుల విదేశీ అకౌంట్లు కు జమ చేయడం ఎవరి నిర్ణయం..ఆర్థిక శాఖ అనుమతులు లేకుండా ఎందుకు నిధులు రిలీజ్ చేశారు..కేబినెట్ అప్రూవల్ లేకుండా నిధులు రిలీజ్ చేయవద్దని మీకు తెలియదా అంటూ ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలుస్తోంది. కేటీఆర్ ఆదేశాలు ఇవ్వడంతోనే నగదు రిలీజ్ చేశామని అరవింద్ కుమార్ స్టేట్‌మెంట్ ఇచ్చారు.



# ఇంగ్లండ్‌తో సిరీస్‌కు రోహిత్ శర్మకు విశ్రాంతి!!

## గిల్‌కు కెప్టెన్ బాధ్యతలు అప్పగించే అవకాశం

ఆస్ట్రేలియాలో ఘోర పరాజయాన్ని మరచిపోయిన టీమిండియా ఇప్పుడు స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగే సిరీస్‌పై కన్నేసింది. జనవరి 22 నుంచి ఇరు జట్ల మధ్య 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్ జరగనుంది. ఆ తర్వాత ఫిబ్రవరి 6 నుంచి మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సమయంలో జరిగే వన్డే సిరీస్‌లో రోహిత్ శర్మ భాగం కావడం లేదని, ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు అతనికి విశ్రాంతి ఇవ్వవచ్చని కొన్ని నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే, రోహిత్ శర్మ ఆడకపోతే వన్డే జట్టుకు కెప్టెన్‌గా ఎవరు వ్యవహరిస్తారనేది అతిపెద్ద ప్రశ్నగా మారింది. ఛాంపియన్స్ ట్రోఫీకి జట్టును ప్రకటించేందుకు జనవరి 12వ తేదీని ఐసీసీ డెడ్‌లైన్‌గా నిర్ణయించింది. ఇలాంటి పరిస్థితుల్లో ఇంగ్లండ్ సిరీస్‌తో పాటు ఛాంపియన్స్ ట్రోఫీకి కూడా బీసీసీఐ జట్టును ప్రకటించవచ్చు. ఛాంపియన్స్ ట్రోఫీలో రోహిత్ ఆడడం ఖాయం. కానీ, ఇంగ్లండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో మాత్రం అతను పాల్గొనడం ఖాయం. ఇటువంటి పరిస్థితిలో, రోహిత్ ఈ సిరీస్‌లో ఆడకపోతే, కెప్టెన్సీకి శుభ్‌మన్ గిల్ అతిపెద్ద పోటీదారుగా మారబోతున్నాడు. ఎందుకంటే, ఈ సిరీస్‌లో జస్ప్రీత్ బుమ్రాకు కూడా విశ్రాంతి ఇవ్వడం దాదాపు ఖాయం.

# రిటైర్మెంట్ తీసుకోబోతున్నట్లు ప్రకటించిన ఫుట్ బాల్ స్టార్ నేమార్

## ఫిఫా 2026 వరల్డ్ కప్ చివరి టోర్నీ అని వెల్లడి

బ్రెజిల్ ఫుట్ బాల్ స్టార్ నేమార్ షాకింగ్ డెసిషన్ తీసుకున్నాడు. తాను రిటైర్మెంట్ తీసుకోబోతున్నట్లు ప్రకటించాడు. ఫిఫా 2026 వరల్డ్ కప్ తాను ఆడబోయే చివరి టోర్నీ అని అన్నాడు. అలానే దిగ్గజ ఫుట్ బాలర్స్ మెస్సీ, సూరెజ్ తో రీయూనియన్ విషయమై హింట్ ఇచ్చాడు. 79 గోల్స్ తో బ్రెజిల్ ఆల్ టైమ్ టాప్ స్కోరర్ గా నిలిచాడు నేమార్. అయితే 32 ఏళ్ల నేమార్ కెరీర్ లో ఎన్ని ఘనతలు సాధించాడో, అలానే గాయాల బారిన కూడా పడ్డాడు. దీంతో ఈ మధ్య కాలంలో చాలా తక్కువ మ్యాచులలోనే బరిలోకి దిగాడు. 2023లో పారిస్ సెయింట్ జెర్మెన్ నుంచి బయటకొచ్చిన కేవలం ఏడు మ్యాచులలోనే ఆడాడు. సౌదీ ప్రో లీగ్ క్లబ్ వారితో అతడి కాంట్రాక్ట్ 2024 జూన్ తో ముగిసిపోయింది. ఈ క్రమంలోనే ఇప్పుడు నేమార్ తన కెరీర్ భవిష్యత్ ప్రణాళిక గురించి హింట్ ఇచ్చాడు. రిటైర్మెంట్ గురించి కూడా వ్యాఖ్యలు చేసాడు. మేజర్ లీగ్ సాసర్ బరిలో దిగడంతో పాటు మాజీ బార్సిలోనా టీమ్ మేట్స్ లియోనెల్ మెస్సీ, లూయిస్ సూపెజ్ తో రీయూనియన్ అయ్యే అవకాశం ఉందని చెప్పుకొచ్చాడు. "నేను ఆడేందుకు ప్రయత్నిస్తాను. కచ్చితంగా ఆడుతాను. నా నేషనల్ టీమ్ కోసం, జట్టుతో ఉండేందుకు చేయాల్సినవన్నీ చేస్తాను. ఇక ఇదే నా చివరి వరల్డ్ కప్. నా లాస్ట్ షాట్, నా లాస్ట్ ఛాన్స్ ఇదే. కాబట్టి నేను ఈ ప్రపంచ కప్ లో ఆడేందుకు ఏదైనా చేస్తాను." అని పేర్కొన్నాడు. నేమార్ , మెస్సీ, లూయిస్.. గతంలో ఈ త్రయం కలిసి అద్భుత రికార్డులను సాధించారు. వీరి మధ్య మంచి స్నేహబంధం కూడా ఉంది. తాజాగా వారితో రీయూనియన్ గురించి నేమార్ మాట్లాడుతూ... "మెస్సీ, లూయిస్ తో కలిసి మళ్లీ ఆడటం అనేది అసాధరణమైన విషయం. వాళ్లు నా స్నేహితులు. మేం ఇప్పటికీ మాట్లాడుకుంటూనే ఉన్నాం. నేను అల్ హిలాల్, సౌదీ అరేబియాతో హ్యాపీగానే ఉన్నాను. ఫుల్ బాల్ అంటేనే ఎన్నో సర్ ప్రైజెస్." అని చెప్పుకొచ్చాడు. కాగా, బ్రెజిల్ జట్టు ప్రస్తుతం సౌత్ అమెరికన్ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ లో ఐదో స్థానంలో ఉంది.


# ఐపీఎల్‌కు బుమ్రాను దూరంగా ఉంచాలి!

## బుమ్రాకు క్రికెట్ ఎక్స్‌పర్ట్ సూచన

టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాను ఐపీఎల్ 2025 సీజన్ ఆడకుండా నిషేధం విధించాలని క్రికెట్ ఎక్స్‌పర్ట్స్ భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ)కి సూచిస్తున్నారు. భారత టెస్ట్ క్రికెట్ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకోవాలని సలహా ఇస్తున్నారు. మరోవైపు టీమిండియా టెస్ట్ కెప్టెన్‌గా కొనసాగాలన్నా.. సుదీర్ఘ కాలం సంప్రదాయక ఫార్మాట్ ఆడాలన్నా బుమ్రా.. ఐపీఎల్‌కు దూరంగా ఉండి ఫిట్‌నెస్ కాపాడుకోవాలని సూచిస్తున్నారు. ఇటీవలే ముగిసిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో బుమ్రా అద్భుత ప్రదర్శన కనబర్చాడు. 5 టెస్ట్‌ల్లో 9 ఇన్నింగ్స్‌ల్లో 32 వికెట్లు పడగొట్టాడు. ఈ సిరీస్‌లో టీమిండియా 1-3తో ఓటమిపాలైనా బుమ్రా అసాధారణ ప్రదర్శనతో మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డ్ అందుకున్నాడు. బౌలర్‌గానే కాకుండా కెప్టెన్‌గా సత్తా చాటాడు. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో టీమిండియాకు సారథ్యం వహించిన బుమ్రా.. అద్భుత కెప్టెన్సీతో విజయాన్నందించాడు. చివరి టెస్ట్‌లోనూ కెప్టెన్సీ చేపట్టిన బుమ్రా దురదృష్టవశాత్తు వెన్ను నొప్పితో మ్యాచ్ మధ్యలోనే టోర్నీ నుంచి తప్పుకున్నాడు. లేకుంటే ఈ మ్యాచ్‌లో కూడా టీమిండియాను గెలిపించేవాడు. బుమ్రా అద్భుత కెప్టెన్సీ నేపథ్యంలో అతన్ని టెస్ట్ కెప్టెన్‌గా నియమించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. అయితే బుమ్రా తరుచూ గాయాలబారిన పడుతుండటం ఇప్పుడు సమస్యగా మారింది. ఫుల్‌టైమ్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇలా తరుచూ గాయాలబారిన పడితే టీమిండియాకు తీవ్ర నష్టం చేయనుంది. ఈ క్రమంలోనే బుమ్రా.. ఐపీఎల్‌కు దూరంగా ఉండి ఫిట్‌నెస్ కాపాడుకోవాలని క్రికెట్ ఎక్స్‌పర్ట్స్ సూచిస్తున్నారు. ఆస్ట్రేలియాతో ఆఖరి టెస్ట్‌లో వెన్ను నొప్పితో బాధపడిన బుమ్రా ఫిట్‌నెస్‌పై స్పష్టమైన సమాచారం లేదు. ప్రస్తుతం అతనికి విశ్రాంతి ఇచ్చారు. ఇంగ్లండ్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌లకు కూడా అతను దూరంగా ఉండనున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో నేరుగా బరిలోకి దిగే అవకాశం ఉంది. అయితే బుమ్రా వెన్ను గాయం తీవ్రత ఎక్కువగా ఉందని, ఛాంపియన్స్ ట్రోఫీ లీగ్ మ్యాచ్‌లకు కూడా అతను దూరమయ్యే అవకాశాలు ఉన్నాయని తాజాగా వార్తలు వచ్చాయి. అదే జరిగితే ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియాకు కష్టాలు తప్పవు. ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 వరకు పాకిస్థాన్ వేదికగా ఛాంపియన్స్ ట్రోఫీ 2025 జరగనుండగా.. టీమిండియా మ్యాచ్‌లు దుబాయ్ వేదికగా జరగనున్నాయి. ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో జరిగే మ్యాచ్‌తో టీమిండియా తమ క్యాంపైన్‌ను ప్రారంభించనుంది. ఫిబ్రవరి 23న పాకిస్థాన్‌తో భారత్ తలపడనుంది.







# తొలి మ్యాచ్‌కు హార్దిక్ పాండ్యా దూరం

## గత సీజన్ లో స్లో ఓవరేట్ కారణంగా బెంచ్ కే పరిమితం


ఓఐపీఎల్ 2025 సీజన్ ప్రారంభానికి ముందే ముంబై ఇండియన్స్‌కు బిగ్ షాక్ తగిలింది. ఆ జట్టు తొలి మ్యాచ్‌కు కెప్టెన్ హార్దిక్ పాండ్యా దూరంగా ఉండనున్నాడు. అప్‌కమింగ్ సీజన్‌లో తమ సారథిగా హార్దిక్ పాండ్యానే కొనసాగుతాడని ఇప్పటికే ముంబై ఇండియన్స్ మేనేజ్‌మెంట్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. మార్చి 13 నుంచి ఐపీఎల్ 2025 సీజన్ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. అయితే ఐపీఎల్ ఓవర్ రేట్ రూల్స్ ప్రకారం ముంబై ఇండియన్స్ తొలి మ్యాచ్‌కు హార్దిక్ పాండ్యా దూరం కానున్నాడు. గత సీజన్(ఐపీఎల్ 2024)లో ముంబై ఇండియన్స్ సారథిగా హార్దిక్ పాండ్యా వరుసగా మూడు సార్లు స్లో ఓవరేట్‌కు గురయ్యాడు. నిర్ణీత సమయంలో తమ జట్టు ఓవర్లను పూర్తి చేయలేకపోయాడు. దాంతో అతనిపై ఓ మ్యాచ్ ఆడకుండా నిషేధం పడింది. స్లో ఓవర్ రేట్ విషయంలో ఆటగాళ్లు సీరియస్‌గా ఉండటం లేదని గ్రహించిన ఐపీఎల్ నిర్వాహకులు కఠిన నిబంధనలు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. మొదటి సారి స్లో ఓవర్‌రేట్‌కు గురైతే కెప్టెన్ మ్యాచ్ ఫీజులో 12 లక్షలు కోత విధిస్తారు. రెండో సారి ఇదే తప్పిదం రిపీట్ అయితే రూ. 24 లక్షలు, మూడో సారి రిపీట్ అయితే రూ. 30 లక్షల మ్యాచ్ ఫీజు కోతతో పాటు ఓ మ్యాచ్ ఆడకుండా నిషేధం విధిస్తారు. అయితే హార్దిక్ పాండ్యా గత సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో మూడోసారి స్లో ఓవర్ రేట్‌కు కారణమయ్యాడు. దాంతో అతను అప్‌కమింగ్ సీజన్ తొలి మ్యాచ్ ఆడకుండా నిషేధం పడింది. ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు హార్దిక్ పాండ్యాను ముంబై ఇండియన్స్ రిటైన్ చేసుకున్న సంగతి తెలిసిందే. అతనితో పాటు రోహిత్ శర్మ, జస్‌ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మలను ముంబై అంటిపెట్టుకుంది. ఈ కోర్ టీమ్‌కు తగ్గట్లుగా వేలంలో ఆటగాళ్లను కొనుగోలు చేసింది. పేపర్‌పై ముంబై ఇండియన్స్ చాలా బలంగా కనిపిస్తోంది. తొలి మ్యాచ్‌కు హార్దిక్ పాండ్యా దూరంకానున్న నేపథ్యంలో ముంబై ఇండియన్స్ తాత్కలిక కెప్టెన్‌గా ఎవరు బాధ్యతలు చేపడుతారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. హార్దిక్ గైర్హాజరీలో టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సారథ్య బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.

# రజినీ కూలీ సినిమా వాయిదా

## కారణం ఏంటో తెలుసా..?



తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ ప్రస్తుతం కూలీ సినిమా షూటింగ్‌తో బిజీగా ఉన్నాడని తెలిసిందే. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్నాడు. తలైవా నెక్ట్స్ షూటింగ్ షెడ్యూల్ కోసం థాయ్‌లాండ్‌కు కూడా పయనమయ్యాడు. కూలీ 70 శాతం షూటింగ్ పూర్తయిందని.. నెక్ట్స్ షెడ్యూల్ జనవరి 13 నుంచి జనవరి 28 వరకు కొనసాగుతుందని కూడా చెప్పాడు. కూలీ చిత్రాన్ని 2025 మే 1న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్టు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. అయితే కూలీ అనుకున్న సమయానికి రావడం లేదన్న వార్త ఒకటి తెరపైకి వచ్చింది. ఈ మూవీని ఆగస్టు 14న విడుదల చేస్తున్నారంటూ ఓ అప్‌డేట్ ఫిలింనగర్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. ఇదే నిజమైతే ఇంతకీ కారణమై ఉంటుందనేది తెలియాల్సి ఉంది. మరి దీనిపై మేకర్స్ ఏదైనా స్పష్టత ఇస్తారేమో చూడాలి. మరోవైపు జూనియర్ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ వార్ 2 కూడా ఇదే రోజు విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్టు బీటౌన్ సర్కిల్ సమాచారం. లోకేశ్ కనగరాజ్ టీం ఇటీవల రాజస్థాన్‌లోని జైపూర్ షూట్ షెడ్యూల్‌లో భాగంగా సంబార్ లేక్ ప్రాంతంలో అమీర్ ఖాన్, ఉపేంద్ర, తలైవా, రెబా మోనికా జాన్ అండ్ టీంపై వచ్చే సన్నివేశాలను చిత్రీకరించారిన తెలిసిందే. గోల్డ్ అక్రమ రవాణా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో సత్యరాజ్, మహేంద్రన్, అక్కినేని నాగార్జున, మంజుమ్మెల్ బాయ్స్ ఫేం సౌబిన్ షాహిర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీని సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ తెరకెక్కిస్తుండగా.. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.



# ఎమర్జెన్సీ సినిమాకు ప్రియాంకాగాంధీని ఆహ్వానించిన కంగనా రనౌత్

బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ కంగనా రనౌత్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం 'ఎమర్జెన్సీ'. దివంగత భారత ప్రధాని ఇందిరాగాంధీ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన ఈ సినిమాలో ఇందిరాగాంధీగా కంగనా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం గతేడాది ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా.. అనుకోని కారణాల వలన వాయిదా పడింది. అయితే రీసెంట్‌గా సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం జనవరి 17న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను కూడా పంచుకుంది. అయితే ఈ సినిమా విడుదలకు ఇంకా 10 రోజులే ఉండడంతో వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది కంగనా. ఈ క్రమంలోనే 'ఎమర్జెన్సీ' సినిమాను చూడాలని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీని ఆహ్వానించినట్లు కంగనా తెలిపింది. పార్లమెంటులో ప్రియాంక గాంధీని కలిశాను. ఆమెని కలిసిన అనంతరం నేను చెప్పిన మొదటి మాట.. ఆప్కో ఎమర్జెన్సీ దేఖ్నీ చాహియే (మీరు ఎమర్జెన్సీ సినిమాని చూడాలి). మీకు ఇది బాగా నచ్చుతుంది అంటూ ప్రియాంకాకు చెప్పాను. అయితే ఈ విషయంలో ప్రియాంక కూడా సున్నితంగా స్పందిస్తూ.. అవును కావచ్చు అంటూ తెలిపినట్లు కంగనా చెప్పుకోచ్చింది. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ప్రియాంకకు నాన్నమ్మ అవుతుందన్న విషయం తెలిసిందే. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఇందిరా గాంధీ ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో 1975 నుంచి 1977 వరకు 21 నెలల పాటు 'ఎమర్జెన్సీ' విధించిన విషయం తెలిసిందే. ఈ సమయంలో భారత ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మీడియా ఎలా అణచివేయబడింది. వంటి యదార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమా రాబోతుంది. ఈ సినిమాను జీ స్టూడియోస్, మణికర్ణిక ఫిలిమ్స్ బ్యానర్లు నిర్మిస్తున్నాయి. ఈ చిత్రంలో అనుపమ్ ఖేర్, మహిమా చౌదరి, మిలింద్ సోమన్, శ్రేయాస్ తల్పాడే తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



# గేమ్‌ఛేంజర్, డాకు మహారాజ్‌కు ఏపీ హైకోర్టు బిగ్‌షాక్

ఈ ఏడాది సంక్రాంతికి టాలీవుడ్ నుంచి పెద్ద సినిమాలు రాబోతున్న విషయం తెలిసిందే. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటించిన చిత్రం గేమ్ ఛేంజర్, నటసింహం నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్.. విక్టరీ వెంకటేశ్ నటించిన సంక్రాంతికి వస్తున్నాం చిత్రాలు పండుగ బరిలో నిలిచాయి. ఇందులో గేమ్ ఛేంజర్ మూవీ ఈనెల 10న ప్రేక్షకుల ముందుకు రానుండగా ఈనెల 12న డాకు మహారాజ్ విడుదల కానుంది. జనవరి 14న సంక్రాంతికి వస్తున్నాం వస్తుంది. ఈ సినిమాల విడుదల సందర్భంగా టికెట్ల ధరల పెంపునకు ఏపీ ప్రభుత్వం అనుమతులు సైతం మంజూరు చేసింది. అయితే ఈ టికెట్ల పెంపునకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు అయిన విషయం తెలిసిందే. టికెట్ల ధరలను పెంచడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఇందులో గేమ్ ఛేంజర్, డాకు మహారాజ్ సినిమాలకు సంబంధించిన మూవీటీమ్‌లను ప్రతివాదులుగా చేర్చారు. నిబంధనలకు విరుద్ధంగా టికెట్ల పెంపు జరిగిందని ప్రభుత్వ ఉత్తర్వులు రద్దు చేయాలని పిల్‌లో కోరారు. అయితే ఈ పిటిషన్‌ని నేడు విచారించిన హైకోర్టు టికెట్ల రేట్లపై సంచలన తీర్పును వెల్లడించింది. ఈ రెండు సినిమాల టికెట్ రేట్లను 14 రోజులు పెంచుకోవడానికి ప్రభుత్వం అనుమతినివ్వగా.. ఈ అనుమతిని 10 రోజులకు కుదించింది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం విడుదలైన 10 రోజుల వరకు పెంచిన రేట్లు అందుబాటులో ఉండనున్నాయి.

# శర్వానంద్ కోసం నందమూరి, కొణిదెల హీరోలు

హిట్టు ఫ్లాప్‌లు సంబంధం లేకుండా సినిమాలు చేసుకుంటూ వెళుతున్నాడు టాలీవుడ్ నటుడు శర్వానంద్. గతేడాది మనమే అంటూ వచ్చి విజయాన్ని అందుకున్నాడు. అయితే ఈ నటుడు ప్రధాన పాత్రలో వస్తున్న తాజా ప్రాజెక్ట్ శర్వా 37. 'సామజవరగమన' దర్శకుడు రామ్ అబ్బరాజు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్లు నటిస్తున్నారు. వారిలో ఒకరు సంయుక్త కాగా మరొకరు యంగ్ బ్యూటీ సాక్షి వైద్య. ఇప్పటికే ఈ సినిమా నుంచి శర్వానంద్ తో పాటు సాక్షి వైద్య ఫస్ట్ లుక్స్ రిలీజ్ అయ్యాయి. తాజాగా ఈ మూవీ నుంచి టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్‌ని విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ టైటిల్ లాంచ్ కోసం నందమూరి హీరోతో పాటు కొణిదెల హీరో ముఖ్య అతిథులుగా రానున్నట్లు చిత్రబృందం తెలిపింది. అయితే వారేవరు అనేది తెలియాలంటే జనవరి 14 వరకు వెయిట్ చేయాల్సిందే. ఈ మూవీకి 'నారీ నారీ నడుమ మురారి' అనే టైటిల్ ఫిక్స్ అయినట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. గతంలో ఇదే పేరుతో బాలయ్య ఓ సినిమా చేశారు. ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర ఈ సినిమాను నిర్మిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు.






# ఆ సన్నివేశాలను తొలగించండి

## కోర్టును ఆశ్రయించిన రమ్య

అభిమన్యు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది కన్నడ భామ రమ్య. ఈ మాజీ మైసూరు ఎంపీ తాజాగా కోర్టును ఆశ్రయించింది. 2023లో రిలీజైన కన్నడ కామెడీ డ్రామా. రమ్య కామియో రోల్‌లో మెరిసింది. అయితే తన అనుమతి లేకుండా ఈ సినిమాలో ఉపయోగించిన సీన్లను తొలగించాలని నిర్మాతలను కోరుతూ బెంగళూరులోని కమర్షియల్ కోర్టు కాంప్లెక్స్‌ను ఆశ్రయించింది. ట్రైలర్‌తోపాటు సినిమాలోని పుటేజీలో కొన్ని సన్నివేశాలను తన ప్రమేయం లేకుండా వాడారని రమ్య ఫిర్యాదులో పేర్కొన్నది. నిర్మాతలు అనుమతి లేకుండా వాడిన తన వీడియోలను తొలగించడమే కాకుండా.. తనకు కోటి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ విషయమై నిర్మాతలకు పలుమార్లు విజ్ఞప్తి చేసిన తన సీన్లు తొలగించడం, ఎలాంటి యాక్షన్ తీసుకోవడం కానీ చేయలేదని రమ్య ఆరోపించింది. సినిమాలోని తన సన్నివేశాలను తొలగిస్తే కేసును వెనక్కి తీసుకుంటానని కూడా రమ్య చెప్పినట్టు ఇండస్ట్రీ సర్కిల్ టాక్. మరి రమ్య వ్యవహారంపై నిర్మాతలు ఎలా స్పందిస్తారనేది తెలియాల్సి ఉంది.



# నేను ఎవరినీ ఉద్దేశించి అలా వ్యాఖ్యలు చేయలేదు : రాజేంద్రప్రసాద్

టాలీవుడ్ సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ ఇటీవల అల్లు అర్జున్ నటించిన పుష్ప సినిమాపై సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఓ సినిమా ప్రమోషన్ ఈవెంట్‌లో భాగంగా ఆయన మాట్లాడుతూ.. వాడెవడో ఎర్ర చందనం స్మగ్లింగ్ చేసే దొంగ (పుష్ప సినిమాలో అల్లు అర్జున్ పాత్ర).. వాడు హీరో.. ప్రస్తుతం హీరోల్లో అర్థాలు మారిపోయాయి.. నాకున్న అదృష్టం ఏంటంటే 48 సంవత్సరాలుగా నేను సమాజంలో మన చుట్టూ ఉన్న ట్వంటి పాత్రలతో డిఫరెంట్ హీరో అనిపించుకున్నా.. అంటూ కామెంట్ చేశాడు. అయితే నటకిరీటి చేసిన వ్యాఖ్యలు ముదరడంతో తర్వాత క్లారిటీ ఇచ్చాడు. తాను అల్లు అర్జున్‌ను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేయలేదని తెలిపాడు. అల్లు అర్జున్ నా కొడుకు లాంటి వాడు. అతడిని అలా అంటానా. అంటూ రాజేంద్రప్రసాద్ తెలిపాడు. దీంతో ఈ వివాదం సద్దుమణిగింది. ఇదిలావుంటే.. ఈ విషయంపై మరోసారి స్పందించాడు రాజేంద్రప్రసాద్. ఈ విషయంపై నేను ఇటీవల అల్లు అర్జున్‌ని కలిశాను. అయితే బన్నీ మాట్లాడుతూ.. మీరు ఆ మాటలు అనలేదని నాకు తెలుసు అన్నాడు. పిచ్చోడా నేనే అన్నాను అని చెప్పాను. దానికి బన్నీ మీరు అన్నది తెలుసు. కానీ మీరు వేరే ఉద్దేశ్యంతో అనలేదు అని తెలిపాడు. సరిగ్గా చెప్పావు. నా ఉద్దేశ్యం అది కాదు. ఇప్పుడు సోషల్ మీడియా ఎలా తయారయ్యింది అంటే.. నేను నాకు తెలిసిన ఒక మీడియా మిత్రుడిని అడిగాను. నేను మాట్లాడింది ఒకటి అయితే నువ్వు టైటిల్ వేరే ఎందుకు పెట్టావు అని నిలదీయగా.. వాడు అలా థంబ్‌నెల్స్ లేకపోతే ఎవరు చూడట్లేదని తెలిపాడు. దీంతో నేను షాక్ అయ్యాను. ఇలా చేయడం వలన తెలికుండానే నెగిటివ్‌గా పోతున్నాయి. అంటూ రాజేంద్ర ప్రసాద్ చెప్పుకోచ్చాడు.


Published and Printed by Vulloju Srinivas On Behlf of Sri Veena Publications Printed at Telalangana Veena Flat NO: 204 Mythri Apartments, Opp Bsnl Office Ecil,Kapra,Med
Responsibble for Selection of News Under The PRB ACT, Phone Number: 040 35668720, RNI Reg N0: TELTEL/12280 Reproduction in Whole or in Part Without Written